J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 20 20.10.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## రానున్న ఎన్నికలలో..

# ఆంధ్రా గెలుపు




# దేశ రాజకీయాలకు మలుపు!

# నయా నాయకులకు మేలుకొలుపు!!

***దేశమంతా ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. కొత్త కొత్త పార్టీలు, నూతన సమీకరణాలు, గోడదూకుడు రాజకీయాలతో ప్రతి ఒక్కరూ తమతమ పనుల్లో తలమునకలై ఉన్నారు. ఎవరి అభివృద్ధి ఎంత అనడంకంటే ఎవరేమి వరదానాలు ఇస్తారో అన్న దాని మీద ఈసారి గెలుపోటములు ఆధారపడే అవకాశమే ఎక్కువగా ఉంది. ప్రత్యేకించి అందరూ ఆంధ్ర వైపే చూస్తున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జగన్ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలను కేవలం ఒకే ఒక బటన్ నొక్కడం ద్వారా నేరుగా ప్రజల ఖాతాలలోకి జమ చేస్తోంది. అయితే అభివృద్ధి పరంగా చూస్తే మాత్రం రోడ్లు, నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతులూ ఇలా చెప్పుకుంటూపోతే అన్నీ వెక్కిరిస్తున్నాయి. అభివృద్ధి కంటే జనాల ఖాతాల్లో డబ్బులు వేయడం మీదనే ప్రభుత్వం ఎక్కువ ఆసక్తి చూపించింది. ఈ నేపథ్యంలో ప్రజలు మళ్ళీ వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి పట్టం కడితే మాత్రం దేశమంతా ఓ నయా ట్రెండ్ మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది. అభివృద్ధి అనే పదాన్ని పక్కనపెట్టి వచ్చిన ఆదాయాన్ని అందరికీ పందేరం చేసే ఓ కొత్త సంస్కృతి మొదలయ్యే సూచనలు బలంగా కనిపిస్తున్నాయని విశ్లేషకుల అంచనా.***

ఎన్నికలు వచ్చాయంటే చాలు... ఎక్కడా లేని అద్భుతమైన ఆలోచనలు మన రాజకీయ నాయకులకు వచ్చేస్తాయి. సాధ్యమా, అసాధ్యమా అని కూడా ఆలోచించకుండా ప్రజలకు ఏమిస్తే తమను ఆదరిస్తారో, వాళ్ళని ఎలా లొంగదీసుకోవాలో, ఏ విధంగా బుట్టలో వేసుకోవాలో బాగా కనుక్కుని, ఆ దిశగా కుప్పలు తిప్పలుగా హామీలు గుప్పించి ఓట్లు దండుకోవడానికి సిద్ధమైపోతారు. గతంలో అభివృద్ధి మంత్రంతో ప్రజల్లోకి వెళ్ళే రాజకీయనాయకులు ఆ తర్వాత గ్రైండర్లు, టీవీలు, వీసీఆర్‌లు (ఒకప్పుడు), ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, చీరలు, క్రికెట్టు కిట్టులు వంటి వాటితో పాటు ఇంకా ఉచిత తాయిలాల ఎరవేసి గెలిచారు. ఇప్పుడు పరిస్థితి మారింది. మేము కొని మీకు ఉచితంగా ఇచ్చేదేంటి, ఆ డబ్బులు మీ అకౌంట్లలోనే వేసేస్తాం, మీకు కావలసింది మీరే కొనుక్కోండి అంటూ ప్రజలకు బంపర్ ఆఫర్ ఇచ్చేస్తున్నారు. అత్యధిక భాగం ప్రజలకు కూడా ఇదే నచ్చుతోంది. అభివృద్ధి సంగతి ఎలా ఉన్నా, మా డబ్బులు మాకొస్తే చాలు అనే మనస్తత్వం పెరిగిపోయింది. దేశం రాష్ట్రం ఎటుపోతే నాకెందుకు ...? నాకు డబ్బులొస్తున్నాయి అదే పదివేలు అన్నట్లుగా ఓటర్ల ఆలోచనా సరళి మారుతోంది. కొంతమంది అయితే ఒక అడుగు ముందుకు వేసి, ఎవరు మాత్రం తినటం లేదు, మా నాయకుడు తిని, మాకు కూడా కాస్త విదిలిస్తున్నాడు అంటూ మహాభక్తితో సాష్టాంగపడుతున్నారు.

## జనం కోసం పథకాలా... పథకాల కోసం జనమా?

భారతదేశం ప్రజాస్వామ్య దేశం. ప్రజలు ఏదనుకుంటే అదే ఇక్కడ శాసనం. పాతాళభైరవి సినిమాలో మాంత్రికుడు చెప్పినట్లు "జనం కోరేది మనం శాయడమా... మనం చేసేది జనం చూడటమా" అనే సూత్రాన్ని బాగా అలవరుచుకున్నారు. ఇప్పటి వరకూ జనం కోరేది చేశారు. ఇప్పుడు జనం కోరుకునేలా కొత్త వారు చేసే వాటితో కొత్త ఎత్తులు వేస్తున్నారు. జనం కోసం పథకాలా...? పథకాల కోసం జనమా..?? అన్న కోణంలో ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్.ఆర్.సి.పి పాలన సాగుతోంది. అమ్మఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, రైతు భరోసా, సున్నా వడ్డీ రుణాలు, ఉచిత పంటల బీమా, మత్స్యకార భరోసా, పెన్షన్ కానుక, ఆ చేయూత, ఈ ఆసరా, కాపు నేస్తం, నేతన్న నేస్తం, అన్న చేదోడు, లా నేస్తం, వాహన మిత్ర, ఆరోగ్య ఆసరా... ఇలా ఒకటా రెండా, వైఎస్ఆర్ పేరుతో కొన్ని, జగనన్న పేరుతో మరికొన్ని పథకాల రూపంలో ప్రజల ఖాతాల్లో నేరుగా డబ్బులు పడిపోతున్నాయి. వాలంటీర్ వ్యవస్థ పుణ్యమా అని ఎవరెవరికి అందుతున్నాయో, ఏ విధంగా అందుతున్నాయో ఎప్పటికప్పుడు ప్రభుత్వం దగ్గర సమాచారం కూడా ఉంటోంది. అంటే దాదాపు పేద, మధ్యతరగతి వారంతా ఏదో ఒక రూపంలో ప్రభుత్వం నుంచి నేరుగా డబ్బులు అందుకుంటున్నారనడంలో సందేహమే అవసరం లేదు.

ఈ ధీమాతోనే జగన్ నాకు తిరుగులేదనే ఆలోచనలో ఉన్నట్లు విశ్లేషకులు చెప్తున్నారు. కానీ ప్రజాస్వామ్యంలో ఒక నమ్మకం ఎప్పుడూ నిలబడిన దాఖలాలు లేవు. ప్రజలు ఎప్పుడు ఏ విధంగా మనసు మార్చుకుంటారో చెప్పటం కష్టం. అయితే నేరుగా వారికి డబ్బులు జమ అయ్యాయి కాబట్టి, కచ్చితంగా తమకు ఓటు వేస్తారని అధికార పార్టీ భావిస్తోంది. ఎన్నికల సమయంలో డబ్బులు ఇవ్వటం కాదు, ఎన్నికల తర్వాత కూడా మీకు డబ్బులు వస్తూనే ఉంటాయనే ఆశ చూపి ప్రజలను బుట్టలో వేసుకునే ప్రయత్నంలానే ఇది కనిపిస్తోందన్నది మరికొందరి వాదన. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఆలస్యమైనా, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు డబ్బులు లేకపోయినా, ప్రభుత్వ ఖజానాలు నిండుకున్నా... అప్పో సప్పో చేసి ప్రజల ఖాతాల్లో పడే డబ్బులకు మాత్రం లోటు రానీయకుండా చూస్తోంది వైసీపీ ప్రభుత్వం. కోవిడ్ వంటి సమయంలో కూడా తల తాకట్టు పెట్టి మరీ ప్రభుత్వం జనం ఖాతాలలో డబ్బులు వేసింది. అయితే ఇది వై.ఎస్.ఆర్.సి.పి.ని గెలుపు వైపు నడిపిస్తుందా...? లేదా..?? అన్నది ప్రస్తుతం దేశం ముందున్న ప్రశ్న.

## మారుతూ వస్తున్న రాజకీయాలు..!


ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ రాకతో రాజకీయాలు ఒక్కసారిగా

10లో




## వాళ్ళంతా ఒక్కటే... మధ్యలో జనమే...!

సత్యపీఠం 4లో...



# రూ.20వేల కోట్లతో మత్స్యరంగం అభివృద్ధి

## కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల



కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల ఈనెల 14న నెల్లూరుకు వచ్చారు. విఆర్‌సి గ్రౌండ్‌లో ఏర్పాటైన 'సింహపురి సేంద్రీయ మేళా'లో రాష్ట్ర మంత్రి అప్పలరాజు, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రం మత్స్యరంగానికి అందిస్తున్న ప్రోత్సాహాలను ఆయన వివరించారు. మత్స్యకార రంగానికి గత ప్రభుత్వాలు ప్రాధాన్యత కల్పించలేదని, మోడీ ప్రధాని అయ్యాక ఆ లోటును తీరుస్తూ, కేంద్ర మత్స్య మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. మత్స్యరంగం అభివృద్ధికి ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద కేంద్రం రూ.20వేల కోట్లు కేటాయించిందని, ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కి రూ.2500 కోట్ల విలువైన ప్రాజెక్టులను మంజూరుచేయడం జరిగిందని చెప్పారు. దేశంలోనే అత్యధికంగా ఏపీలోనే 30 శాతం మత్స్యసంపద ఉత్పత్తి అవుతోందని తెలిపారు. కృష్ణపట్నం వద్ద ఫిషింగ్ జెట్టీ నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, త్వరలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా దానిని ప్రారంభించి జాతికి అంకితం చేస్తామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. కేంద్రప్రభుత్వ సహకారంతో ప్రతిజిల్లాలో ఒక హార్బర్ ఏర్పాటుచేస్తామని, రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోర్ట్‌లను కూడా నెలకొల్పుతామని ఆయన చెప్పారు. పులికాట్ డ్రెడ్జింగ్‌పనులకు కూడా త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. ఎంపీ జీవిఎల్ నరసంహారావు, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, ఆప్కాఫ్ ఛైర్మెన్ అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ట్రిబ్యునల్‌తో రాష్ట్రానికి నష్టమే!

## - రైతు సంఘం నాయకులు



కృష్ణాజలాల పంపిణీ విషయంలో ఇప్పటికే బ్రిజేష్ కుమార్ కమిటీ సిఫార్సులున్నా, కొత్తగా కేంద్రం రాష్ట్రప్రభుత్వంతో సంప్రదించకుండా ట్రిబ్యునల్ కమిటీని వేయడం అన్యాయమని, దాంతో రాష్ట్రానికి నష్టం కలుగుతుందని నెల్లూరులోని రైతుసంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 14న స్థానిక సిపిఎం కార్యాలయంలో రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పులిగండ్ల శ్రీరాములు, మూలి వెంగయ్య, చంద్ర రాజగోపాల్ తదితరులు మాట్లాడుతూ, ప్రతి ఏడాది కృష్ణా జలాలను నెల్లూరుజిల్లాలోని సోమశిల జలాశయానికి విడుదల చేస్తారని, ఇప్పుడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్రప్రభుత్వం ఆ జలాలను తెలంగాణకు మళ్లించేందుకు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సముచితం కాదని, కేంద్రం ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆమేరకు రాష్ట్రప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు జరపాలని వారు సూచించారు.

# మరో 23మందికి జరిమానాలు

మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 23 మందికి ఒక్కొక్కరికి 10వేల రూపాయల వంతున ఇటీవల కోర్టు జరిమానాలు విధించింది. నెల్లూరు నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో తాగి, వాహనాలు నడుపుతున్నవారిని పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసులు నమోదుచేసి కోర్టు ముందు హాజరుపెట్టారు. రెండవ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎల్.శారదారెడ్డి వారికి జరిమానాలు విధిస్తూ తీర్పుచెప్పారు.

# బ్రాహ్మణ కుటుంబాలకు.. నిత్యావసర సరుకులు పంపిణీ



కోట మండలంలోని సిద్ధవరంలో అర్చకులు, పురోహితులైన 20 మంది బ్రాహ్మణ కుటుంబాల వారికి ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి - హైమవతమ్మ, వారి కుమారుడు - కుమార్తె మధుకిరణ్‌రెడ్డి, లావణ్యలు ఈనెల 14న నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక శ్రీ కల్యాణ రామాలయంలో శ్రీ సీతారామ ధార్మిక సేవాసంస్థ నేతృత్వంలో, తిరుపతి జిల్లా అర్చక సలహామండలి సభ్యుడు దివి అనంతబాబు చేతులమీదుగా ఈ కార్యక్రమం చేపట్టారు. జ్యోతిష ప్రముఖుడు వాకాని కృష్ణప్రసాద్, వంశీప్రియ, సుప్రియ, శ్రీనివాస్, లక్ష్మీకుమారి, సురేంద్రరెడ్డి, గురుప్రసాద్, శివకుమార్, నరేష్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

# బయోటెక్నాలజీ కోర్సుకు అడ్మిషన్లు

నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)లో బయోటెక్నాలజీ కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఈ నెల 21వ తేదీ వరకు జరిగే ఈ అడ్మిషన్లకు ఆసక్తికలిగిన విద్యార్థులు యూనివర్శిటీలోని ప్రిన్సిపాల్ కార్యాలయం వారితో సంప్రదించాలని విఎస్‌యు రిజిస్ట్రార్ డా.రామచంద్రారెడ్డి తెలిపారు. స్పాట్ అడ్మిషన్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని పేర్కొన్నారు. దరఖాస్తులకు, ఇతర వివరాలకు యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు.

## 21వరకు లాయర్ల
# విధుల బహిష్కరణ

రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉత్తర్వులకు వ్యతిరేకంగా నెల్లూరు న్యాయవాదులు ఈనెల 21వ తేదీ వరకు విధులను బహిష్కరించాలని ఈనెల 16న తమ కమిటీ నిర్ణయించినట్లు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యాయాదవ్ తెలిపారు. కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేసేవారు అదనంగా రూ.20 వెల్ఫేర్ ఫండ్ స్టాంపు అతికించాలన్న నిబంధనను వ్యతిరేకిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ వారు ఈనెల 6 నుంచి విధులను బహిష్కరిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిరసనను ఈనెల 21వరకు పొడిగించినట్లు వారు పేర్కొన్నారు.

# స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



నెల్లూరులోని పలు స్కానింగ్ సెంటర్లలో ఇటీవల వైద్యాధికారులు, జిల్లా వైద్యసలహా మండలి సభ్యులు ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యారోగ్యశాఖ డెమో అధికారులు శ్రీనివాసరావు, కనకరత్నం, సలహాకమిటీ సభ్యులు ఐ.శ్రీనివాసరావు, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సంఘానికి
# కొత్త కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) జిల్లాశాఖ ఇటీవల కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంది. జిల్లా అధ్యక్షునిగా కె.కె రాజగోపాలాచార్యులు, ప్రధాన కార్యదర్శిగా పి.అనిల్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా మణికంఠాచారి ఎన్నికయ్యారు. ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్‌చాలక్ బాలు సుబ్బారావు, అపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమేష్‌బాబు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. కొత్త కమిటీతో వారు ప్రమాణం స్వీకారం చేయించారు. రాష్ట్ర సంఘం నాయకులు శ్రవణ్‌కుమార్, సహాధ్యక్షులు చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా కమిటీకి..కొత్త సారథులు

ఇటీవలే బీజేపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన వంశీధర్‌రెడ్డి ఈనెల 13న జిల్లాకు తన సారథ్యంలో కొత్త కమిటీని నియమించారు. ఉపాధ్యక్షులుగా నరసింహనాయుడు (నెల్లూరు), పీవీ నారాయణరెడ్డి (ఉదయగిరి), ఎన్‌సి పెంచలయ్య (నెల్లూరు రూరల్), బట్టల కృష్ణయ్య (ఆత్మకూరు), బి.శ్రీనివాసులు (నెల్లూరు), మాధవి (కావలి), కృష్ణారెడ్డి (కందుకూరు)లను నియమించుకున్నారు. అదేవిధంగా, ప్రధాన కార్యదర్శులుగా జి.విజయకుమార్, వై.రాజేష్ (నెల్లూరు రూరల్)లను, కె.బుజ్జిరెడ్డి (ఆత్మకూరు), యశ్వంత్‌సింగ్ (నెల్లూరు), కార్యదర్శులుగా ఎన్‌పి పరశురామ్ (కోవూరు), కాసా శ్రీనివాసులు (కోవూరు), దాసరి ప్రసాద్ (నెల్లూరు), బ్రహ్మానందరెడ్డి (ఉదయగిరి), చిలకా ప్రవీణ్ (నెల్లూరు రూరల్), జి.శ్రీజ (కోవూరు) నియమితులయ్యారు. కోశాధికారిగా సీవి సత్యం (కావలి)ను నియమించారు. జిల్లా యువమోర్చా అధ్యక్షులుగా జి.అశోక్ నాయుడును, ఓబీసీ మోర్చా అధ్యక్షునిగా వై.ఫణిరాజు, ఎస్టీ మోర్చా అధ్యక్షునిగా ప్రసాద్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కె.సుభాషిణి, మైనార్టీ మోర్చా అధ్యక్షునిగా ఖాదర్‌బాషా నియమితులయ్యారు.

# బాల్య వివాహాలు వద్దంటూ..ర్యాలీ



బాల్య వివాహాలు వద్దని, చిన్న వయసులోనే వివాహాలు చేస్తే కలిగే అనర్థాల వల్ల వారి జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని ప్రజలకు అవగాహన కలిగిస్తూ ఈనెల 16న నెల్లూరులో ర్యాలీ నిర్వహించారు. మెప్మా పీడీ రవీంద్ర ర్యాలీకి జెండా ఊపారు. విఆర్‌సి కూడలి వద్ద నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ జరిగింది. అమ్మాయికి 18 ఏళ్ళు, అబ్బాయికి 21 ఏళ్ళు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు చేయడం, లేదా ప్రోత్సహించడం నేరమని, బాల్య వివాహాల నిరోధానికి అందరూ కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఐసిడిఎస్ పీడీ హేనా సుజన, బాలల సంరక్షణాధికారులు సురేష్, సమత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, భవాని, సుహాసిని, శాంతి, హైమావతి, సాధన పాల్గొన్నారు.

# అపోలో వైద్యునికి..అరుదైన అవార్డు




వివరాలను వెల్లడిస్తున్న శ్రీరామ్ సతీష్, వేదమూర్తి రెడ్డి

నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో యూరాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ పి. వేదమూర్తిరెడ్డికి అరుదైన అవార్డు లభించింది. 2021లో ఓ 46 ఏళ్ల రోగి శరీరంలో కుడిపక్కన అడ్రినల్ గ్రంథిలో ఉన్న మైలోలైపోమా అనే పెద్ద కణితిని ఎలాంటి కోత లేకుండా లాప్రోస్కోపీ ద్వారా విజయవంతంగా తొలగించినందుకు ఆయనకు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఈ అవార్డును ఆయనకు ప్రకటించారు. దక్షిణ భారతదేశంలోనే ఇంతకుముందెన్నడూ లేనివిధంగా, లాప్రోస్కోపీ ద్వారా 13 సెంటీమీటర్ల కణితిని తొలగించడం అపురూపమైన విషయమని ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీరామ్ సతీష్ చెప్పారు. ఇటీవల ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఆ విషయాన్ని నిర్ధారించి, ధ్రువపత్రాలతో పాటు అవార్డును పంపారని ఆయన తెలిపారు. డాక్టర్ వేదమూర్తిరెడ్డికి ఈ సందర్భంగా ఆయనకు అపోలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు చెప్పారు.

# ఆకట్టుకున్న అంగన్‌వాడీల ఫుడ్ ఎగ్జిబిషన్



బుచ్చిరెడ్డిపాళెం నాగమాంబాపురంలో ఈనెల 16న అంగన్‌వాడీ టీచర్లు ఫుడ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. బాలామృతంతో కేకులు, తినుబండారాలు తయారుచేసి ప్రదర్శనకు పెట్టగా, అవి బాగున్నాయంటూ అధికారులు మెచ్చుకున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా, సూపర్‌వైజర్ శకుంతల ఆధ్వర్యంలో వాటిని తయారుచేశారు. పోషకాహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ, ప్రభుత్వం బాలామృతాన్ని, పోషక బియ్యాన్ని అందజేస్తోందని తల్లులు-గర్భవతులు వాటిని ఎలా వినియోగించుకోవాలో ఈ సందర్భంగా ఆమె వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పి.లలిత, పి.మాధురి తదితరులు పాల్గొన్నారు.



# ఫలించనున్న వెంకయ్య ఆకాంక్ష

- జాతీయస్థాయి విద్యాసంస్థ ఏర్పాటు దిశగా మళ్లీ అడుగులు
- సంతోషం వ్యక్తం చేసిన పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

***జిల్లాలో జాతీయస్థాయి విద్యాసంస్థను ఏర్పాటుచేయాలన్న ఆకాంక్షతో మాజీ ఉప రాష్ట్రపతి, మన నెల్లూరీయులు ముప్పవరపు వెంకయ్యనాయుడు చొరవతో గతంలో నెల్లూరుకు మంజూరైన ఎన్‌సిఇఆర్‌టీ (జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ)కి ఎట్టకేలకు మంచిరోజులు రానున్నాయి. కారణాంతరాల వల్ల అది ప్రారంభానికి నోచుకోకపోయినా, తాజాగా కేంద్రం అధికారులు ఇక్కడ పర్యటించి, ఆ సంస్థ ప్రారంభానికి సన్నాహాలు చేస్తుండడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.***

నెల్లూరుజిల్లాలో జాతీయ స్థాయి విద్యాసంస్థను ఏర్పాటుచేయాలనే వెంకయ్యనాయుడు సంకల్పంతో, గతంలో వెంకటాచలం మండలంలోని చవటపాళెం వద్ద జాతీయ రహదారికి కిలోమీటరు దూరంలో సుమారు 50 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. 2016లో వెంకయ్య కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు, అప్పటి కేంద్రమంత్రి ప్రకాశ్ జవడేకర్‌తో కలసి భవనాల నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. అయితే, కాలక్రమంలో భూసేకరణకు పరిహారం మంజూరు, నిధుల కేటాయింపు జరగకపోవడంతో ఈ సంస్థ శిలాఫలకానికే పరిమితమైంది. ఎట్టకేలకు ఏడేళ్ల తర్వాత ఇప్పుడు మళ్ళీ కదలిక వచ్చింది. కేంద్రం నుంచి అధికారులు రావడం, స్థలాన్ని పరిశీలించడం జరిగాయి. దీంతో ఇక త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని అందరూ సంతోషిస్తున్నారు. ఈనెల 18న ఎన్‌సిఇఆర్‌టీ ప్రిన్సిపాల్ వై.శ్రీకాంత్, మరో అధికారిణి కల్పనా వేణుగోపాల్ తదితరులు శిలాఫలకాన్ని పరిశీలించారు. ఈ సంస్థకు కేటాయించిన భూముల పూర్వాపరాలను, ప్రస్తుత స్థితిగతులను ఆరా తీశారు. రైతులతో కూడా మాట్లాడారు. భవన నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో, తాత్కాలికంగా కార్యకలాపాలు ప్రారంభించేందుకు వారు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయమై శ్రీకాంత్ ఫోన్ ద్వారా వెంకయ్యనాయుడుకు ఆ వివరాలు తెలియజేశారు. ఆ సంస్థ తాత్కాలిక భవనంలో త్వరలోనే తన కార్యకలాపాలు ప్రారంభించనుందని తెలియడంతో వెంకయ్య తన సంతోషం వ్యక్తం చేశారు.



శిలాఫలకాన్ని సందర్శించిన కేంద్ర అధికారుల బృందం

## ప్రభుత్వాన్ని సంప్రదించి.. సమస్యను పరిష్కరించుకోండి

**- వెంకయ్య సూచన**

ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, 2016లో ఆ విద్యాసంస్థ కేటాయింపు కోసం చొరవ తీసుకుని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా స్థలాన్ని కూడా కేటాయించడం జరిగిందని, స్థలానికి సంబంధించి కొన్ని ఇబ్బందుల కారణంగా జాప్యం అవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇప్పటికైనా ఆ సంస్థ కార్యకలాపాలు ప్రారంభం కానుండడం ఆనందదాయకమని అన్నారు. త్వరలోనే ఆ సంస్థకు సొంత భవనం దిశగా అడుగులు పడాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయ విద్య, నైపుణ్య కార్యక్రమాలను అందించే ఈ జాతీయస్థాయి విద్యాసంస్థ ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో కీలకపాత్ర పోషించగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని స్థల వివాదాన్ని పరిష్కరించుకుని, ఆ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయగలిగితే ఆ సంస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. అందుకు తగు చొరవ తీసుకుని ప్రభుత్వాన్ని సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన ఎన్‌సిఇఆర్‌టి సిబ్బందికి సూచించారు.

# స్వర్ణభారత్ ట్రస్టుకి రండి

## బాబా రాందేవ్‌కి దీపమ్మ ఆహ్వానం




దీపమ్మతో బాబా

విశ్వ విఖ్యాతిగాంచిన యోగా గురువు బాబా రాందేవ్‌ని తమ స్వర్ణభారత్ ట్రస్టులను సందర్శించవలసిందిగా స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ ఆహ్వానించారు. హరిద్వార్ సమీపంలో ఢిల్లీకి వెళ్లే జాతీయ రహదారి పక్కనే గల మహర్షి దయానంద గ్రామ్‌లో ఉన్న పతంజలి యోగ్ పీఠ్ ప్రాంగణంలో బాబా రాందేవ్‌ని దీపమ్మ అక్టోబర్ 17వ తేదీ మంగళవారం నాడు కలిశారు. గతంలో నెల్లూరుకి వచ్చి స్వర్ణభారత్ ట్రస్టు ద్వారా జిల్లా వాసులలో స్ఫూర్తిని కలిగించిన రాందేవ్ బాబాని మరోసారి నెల్లూరుకి రావలసిందిగా దీపమ్మ కోరారు. అలాగే విజయవాడ, హైదరాబాదు శాఖలని కూడా సందర్శించవలసిందిగా కూడా ఆమె విజ్ఞప్తి చేశారు.

'పతంజలి యోగ్ పీఠ్ ట్రస్టు' ద్వారా రాందేవ్ బాబా చేస్తున్న సమాజ సేవలను దీప కొనియాడారు. ట్రస్టు ప్రాంగణం మొత్తం కలియతిరిగి విద్య, వైద్య పరంగా ట్రస్టు ద్వారా జరుగుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాల వివరాలను, ఆయుర్వేద వైద్యంపై చేస్తున్న పరిశోధలను స్వయంగా తెలుసుకున్నారు. నేటి తరంతో పాటు భవిష్యత్ తరాలకు సైతం ఉపకరించేలా బాబా రాందేవ్ చేస్తున్న పరిశోధనాత్మక సమాజ సేవను దీప కొనియాడారు. అనితరసాధ్యమైన కార్యక్రమాలను పతంజలి యోగ్ పీఠ్ ట్రస్ట్ ద్వారా నిర్వహించడం దేశం గర్వించదగిన విషయమని దీపమ్మ అన్నారు.

ఈ సందర్భంగా వెంకయ్య సేవా వారసురాలిగా దీపావెంకట్‌ని బాబా రాందేవ్ అభివర్ణించారు. సేవ కోసం అయన రాజకీయాలను వేదికగా చేసుకుంటే, స్వర్ణభారత్ ద్వారా సంతోష భారత్ కోసం దీపాజీ కృషి చేస్తున్నారని అభినందించారు. తాను నెల్లూరుకి వచ్చినప్పుడు జిల్లా వాసులు చూపించిన ప్రేమ, ఆదరణ ఇప్పటికీ మరువలేకున్నానని అన్నారు. వీలు చేసుకుని స్వర్ణభారత్‌ని సందర్శిస్తానని హామీ ఇచ్చారు. దీపమ్మతో పాటు బాబా రాందేవ్‌ని కలిసిన వారిలో హరిద్వార్ రూరల్ మాజీ శాసన సభ్యులు, మాజీమంత్రి స్వామి యతీశ్వరానంద్, 'లాయర్' పత్రిక సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి(ప్రభు) కూడా ఉన్నారు.



బాబాతో ప్రభు

## రక్తదానానికి యువత ముందుకు రావాలి



రాష్ట్రంలో రక్త నిల్వల కొరత వల్ల రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎంతోమంది బాధితులు, రోగులకు రక్తం అవసరం ఉందని, ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్, శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇటీవల నెల్లూరులోని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో నెల్లూరు రెడ్‌క్రాస్‌కు విశిష్ట స్థానం ఉందన్నారు. తలసీమియా పిల్లల కొరకు రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం నుండి రక్తాన్ని ఇవ్వడం జరుగుతుందని, ప్రతినెలా తలసీమియా పిల్లలకు రక్త మార్పిడి చేయాల్సి ఉన్నందున వారి కోసం ప్రత్యేకంగా రక్తాన్ని అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

అనంతరం, అత్యధిక సార్లు రక్తదానం చేయించిన 109 మంది రక్తదాన ప్రేరేపకులకు (మోటివేటర్స్) జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మన్ డి.సుధీర్ నాయుడు, జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్, ఎం.కోటారెడ్డి, సి.జనార్ధన్‌రాజు, కె.శ్రీహరిరెడ్డి, వి.విజయకుమార్‌రెడ్డి, రక్తనిధి కన్వీనరు సి.హెచ్ అజయ్‌బాబు, ఎ.ఆర్.వి. కన్వీనర్ బి. వెంకురెడ్డి, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ శ్రీరంజని తదితరులు పాల్గొన్నారు. తొలుత, ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ అండ్ ఇమ్యునోహెమటాలజీ వ్యవస్థాపకులైన డా. జే.జి జోలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## అటవీప్రాంతాల్లో నిఘా ముమ్మరం

**- డిఎఫ్‌ఓ చంద్రశేఖర్**



సైదాపురం మండలంలోని అటవీప్రాంతాల్లో అక్రమంగా ఖనిజాలు, తెల్లరాయి గనులను తవ్వకుపోకుండా నిఘా ముమ్మరం చేస్తున్నామని, ప్రత్యేకించి డాగ్‌స్క్వాడ్ కూడా ఏర్పాటుచేశామని జిల్లా అటవీశాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్ చెప్పారు. ఈనెల 18న ఆయన మండలంలోని అటవీభూములను పరిశీలించారు. అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమ తవ్వకాలు జరిపితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు అటవీశాఖ రేంజర్ మాల్యాద్రి, బీట్ ఆఫీసర్ రవిశేఖర్, సెక్షన్ ఆఫీసర్ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

- దిగాలుగా రైతులు

## తగ్గుతున్న నిమ్మ ధరలు



దసరా పండుగ రోజుల్లో నిమ్మకు బాగా డిమాండ్ ఉంటుందని భావించిన నిమ్మ రైతులకు ఈసారి నిరాశే మిగిలింది. నిమ్మకాయల పంట దిగుబడి బాగానే ఉన్నా ధరలు మాత్రం బాగా తగ్గిపోవడంతో రైతులు దిగాలుపడిపోతున్నారు. గత వారం రోజులుగా నిమ్మ మార్కెట్ కుదేలైపోయింది. నిమ్మ దిగుబడి అధికంగా ఉన్న గూడూరు, పొదలకూరు ప్రాంతాల్లో నిమ్మ ధరలు కిలో 20 నుంచి 50 రూపాయల దాకా ఉంది. బస్తా 4వేల రూపాయలైనా ఉంటుందనుకుంటే, రెండున్నర నుంచి మూడువేల రూపాయల ధర పలుకుతున్నాయని, సుమారు వెయ్యి రూపాయల దాకా ధర తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లాయర్
అక్టోబర్ 20, 2023

# మాటలు బోలెడు..ఆచరణ చారెడు

మనదేశంలో రానురాను నాయకుల మాటలకు విలువుండడం లేదు. వాళ్ళు చెప్పేమాటల్లో విశ్వాసం కనిపించడం లేదు. చెప్తున్న మాటలకీ, చేస్తున్న చేతలకీ దూరం పెరుగుతుండడమే అందుకు కారణం కావచ్చు. ఒకప్పట్లో ఇలా ఉండేది కాదు. పాతతరం నాయకులు ఎంతోమంది నిజాయితీగా ఉంటూ సమాజం పట్ల, తమను నమ్ముకున్న ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరించేవారు. అందుకే వాళ్ళు ఏదిచెప్పినా ప్రజలు నమ్మేవారు. మాటలతో మభ్యపెట్టి, సమస్యలను దాటేసే వారు కాదు. చెప్పింది చేయడం, చేయదలచుకుందే చెప్పడం అలవాటుగా ఉండేది. ఇప్పుడా రోజులన్నీ పోయాయి. ఓట్ల కోసం ప్రజలను మాయచేసే మాటలే రాజ్యమేలుతున్నాయి. పర్యావరణాన్ని ప్రకృతిని భలే పరిరక్షిస్తున్నామంటారు. కానీ, ప్రకృతిని విధ్వంసం చేస్తున్నా పట్టించుకోరు. పేదరికాన్ని నిర్మూలించేస్తామంటారు. కానీ, ఎక్కడ చూసినా ఆకలితో అల్లాడే నిరుపేదలే కనిపిస్తుంటారు. నిరుద్యోగాన్ని పూర్తిగా తగ్గించేస్తామని చెప్తూనే ఉంటారు కానీ, నిరుద్యోగులు మాత్రం పెరిగిపోతూనే ఉంటారు. రైతులే దేశానికి వెన్నెముక అంటారు, కానీ రైతులకు గిట్టుబాటు ధరలుండవు. మహిళా సాధికారత అంటారు..ఎందరో మహిళలు నిత్యం అనేకరకాల హింసలకు గురవుతూనే ఉంటారు. ఇలా చెప్పుకుంటూ పోతే వీటికి అంతే ఉండదు. మాటలకు చేతలకు పొంతనే ఉండదు. ఎన్నికలప్పుడైతే నాయకులు ఇచ్చే వాగ్దానాలకు లెక్కే ఉండదు. తీరా అధికారంలోకి వచ్చాక వాటి ప్రస్తావనే కనిపించదు. కళ్ళెదుటే పరిస్థితులు భయంకరంగా ఉన్నా, అంతా బాగుందని గొప్పలు చెప్పుకుంటే ప్రయోజనం ఏమిటి?..మాటలు బోలెడు..ఆచరణ చారెడు అన్నట్లుండే నాయకుల తీరు మారాలి. దేశ పురోగతి విషయంలో మరింత శ్రద్ధ తీసుకోవాలి. అయితే, అభివృద్ధిలో మనదేశం గతంలో కంటే కొంచెం మెరుగ్గానే ఉందన్నమాట వాస్తవం. అంతమాత్రాన అంతా బాగుందనుకోలేం. నత్తనడక నడవడం లేదు కానీ, ఇంకా సరైన ప్రణాళికలతో ముందడుగు వేయడం లేదన్నదే అధికశాతం ప్రజల ఆవేదన. అవినీతి, అరాచకాలు, అసమానతలు పెరిగిపోతూనే ఉన్నా, పేదరికం దేశానికో శాపంగా పరిణమిస్తున్నా వాటిని నివారించేందుకు సరైన కార్యాచరణ ప్రణాళికలు ఉండడం లేదు. మరోవైపు చేజేతులా ప్రకృతిని, పర్యావరణాన్ని నాశనం చేస్తున్నా, అడవుల్ని ..ప్రకృతి వనరుల్ని దోచుకుపోతున్నా పట్టించుకునేవారుండడం లేదు. శాస్త్ర సాంకేతికరంగంలో మన మెంతో ఘనకీర్తి సాధిస్తుండడం, చంద్రయాన్ వంటి అత్యద్భుతాలు సృష్టిస్తుండడం హర్షించదగ్గవే కానీ, నేటికీ మనదేశంలో కోట్లాదిమంది నిరుపేదలు ఆకలిమంటల్లో అలమటిస్తుండడమే బాధాకరం. అయినా.. ఈ దుస్థితి ఇంకా ఎంతకాలం?.. ప్రపంచ ఆకలిసూచీలో నూటపాతిక దేశాలుంటే, అందులో మనదేశం 111వ స్థానంలో ఉందని, ఇది గత ఏడాదికన్నా నాలుగు స్థానాలు కిందికి దిగజారిపోవడమేనని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళవుతున్నా అత్యధికశాతంమంది ప్రజలు నేటికీ దుర్భర దారిద్ర్యంలోనే ఉన్నారన్నది బహిరంగ రహస్యమే. దీనికి ప్రత్యేకించి అధ్యయనాలు అవసరం లేదు. కోట్లాదిమంది ప్రజలు పేదరికంతో, అష్టకష్టాలతోనే జీవితాలు సాగిస్తుండడం అందరికీ తెలిసిందే కదా!.. సరైన పోషకాహారం లేక, ఆహార భద్రత లేక కోట్లాదిమంది బాలలు బక్కచిక్కిపోతుండడం, ప్రతిఏటా లక్షలాదిమంది అనారోగ్యాలతో మృత్యువాత పడుతుండడం, ఉపాధి లేక కష్టజీవులు నానా యాతనలు పడుతుండడం వంటివన్నీ అందరికీ తెలిసినవే. ఇకనైనా ప్రభుత్వాలు, పాలకులు వాస్తవ పరిస్థితులను పెద్దమనసుతో అర్థం చేసుకోవాలి. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా దేశ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలి. కులమతాలకు, పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా కృషిచేయాలి. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా సరైన ప్రణాళికలను రూపొందించి చిత్తశుద్ధితో అమలుచేయాలి. ఏళ్ళతరబడిగా దేశంలో జడలు విరబోసుకుని తిరుగుతున్న దారిద్ర్యాన్ని, నిరుద్యోగాన్ని తరిమికొట్టాలి. అన్యాయాలను, అక్రమాలను, అవినీతిని కఠినచట్టాలు చేసైనా సరే..నియంత్రించాలి. ఎందరో మహనీయుల త్యాగాలతో వచ్చిన మన స్వాతంత్ర్య ఫలాలు కేవలం కొందరికే కాదు, అందరికీ చేరువలోకి వచ్చేందుకు ప్రభుత్వాలు, పాలకులు కృషిచేయాలి. ఎక్కడ అట్టడుగున వున్నామో చూసుకుని, వ్యవస్థలను సరిచేసుకుని, ప్రగతి పథంలో పయనించాలి. మాటలతో కాదు చేతలతోనే అసలైన అభివృద్ధిని సాధించుకోవాలి. అంతిమంగా..ఆకలి సూచీలే అదిరిపడేలా.. ఆకలి కేకలు లేని భారతావనిని సాకారం చేసుకోవాలి.

# హెల్మెట్లు పెట్టుకోకుంటే ఎలా?

ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. స్కూటర్లు, మోటార్ బైక్‌లలో వెళ్ళేవారు తరచూ ప్రమాదాల పాలవుతున్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు పెట్టుకుంటే ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవచ్చని, తలకు గాయమైతే చివరికి ప్రాణాలకే ముప్పు వస్తుందని పోలీసులు, రోడ్డు రవాణా అధికారులు హెచ్చరిస్తూనే ఉన్నా చాలామంది పట్టించుకోవడం లేదు. హెల్మెట్లు పెట్టుకుని వాహనాలు నడిపేవారు అత్యంత తక్కువగానే ఉంటున్నారు. నిబంధనలు పట్టించుకోకుండా అలా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాల్లో ఆ వాహనాలు నడిపేవారే కాక, వారి వల్ల రోడ్డుమీద వెళ్తున్న ఇతర వాహనాల వాళ్ళో, లేదా పాదచారులో కూడా ప్రమాదాల పాలవుతున్నారు. పలువురు మృతిచెందుతున్నారు కూడా. పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటే తప్ప హెల్మెట్లు పెట్టుకోవడం మనవాళ్ళకి అలవాటయ్యేట్లు లేదు. అతివేగం అనర్థదాయకమని, హెల్మెట్లు పెట్టుకుని వాహనాలను జాగ్రత్తగా నడపాలని తెలిసినా బైక్ ఎక్కితే చాలు, పూనకం వచ్చినట్లు అత్యంత వేగంగా నడిపేస్తున్నారు చాలామంది యువకులు. నిలుపు నిదానమనేదే ఉండడం లేదు. ఒకవేళ ప్రమాదాలు జరిగితే...ఆ తర్వాత ఎంత బాధపడి ఏం ప్రయోజనం చెప్పండి. ఇకనైనా నిర్లక్ష్యం వదిలిపెట్టండి. మీ దుందుడుకుతనానికి ఇంట్లోవాళ్ళనీ, వీధిలో వాళ్ళనీ ఏడ్పించకండి. మీకు పుణ్యం ఉంటుంది.. హెల్మెట్లు పెట్టుకోండి నాయన్లారా!...

జె. పరంధామయ్య, కోవూరు.




# తెల్లరాయినీ తవ్వేస్తున్నారు

మట్టిమాఫియా, ఇసుకమాఫియాతో పాటు తాజాగా ఇప్పుడు తెల్లరాయి మాఫియా కూడా తయారైంది. సైదాపురం మండలంలోని పలుగ్రామాల్లో విలువైన తెల్లరాయి దొరుకుతుండడంతో అక్రమార్కులకు దీనిపై కన్నుపడింది. అదేపనిగా మాటువేసి, పోతేగుంట తదితర ప్రాంతాల్లో ఉన్న తెల్లరాయిని అక్రమంగా తవ్వుకుపోతున్నారని, ఏకంగా జేసీబీలు, టిప్పర్లతో సహా వచ్చి దర్జాగా తవ్వకాలు జరుపుతున్నా అడ్డుకునేవారు లేరని గ్రామాల్లో గగ్గోలుగా ఉంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న అధికారులకు, నాయకులకు తెలియకుండానే ఇదంతా జరుగుతుందా అన్నది అనుమానమే. ఎవరిష్టప్రకారం వాళ్ళు ప్రకృతి వనరులన్నిటినీ గుల్లగుల్ల చేసేస్తున్నారు. నదులు, చెరువుల్లో ఎక్కడ చూసినా విధ్వంసమే కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తోంది. ఎప్పుడూ ఇంత అరాచకం చూడలేదు. అటవీశాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోతే, ఇసుక, మట్టిలాగా ఇక తెల్లరాయి కూడా మన చేయి దాటిపోయినట్లే.

ఎస్‌కెఎల్ ప్రసాద్, సైదాపురం.




# వాళ్లంతా ఒక్కటే... మధ్యలో జనమే...!

***"చాలా మంది ఇళ్లల్లో చిన్నపిల్లలు టీవీ చూస్తూ.. తమ అమ్మనో, నాన్ననో, తాతయ్యనో, బామ్మనో రాక్షసుడు ఎలా ఉంటాడు అంటే.. వారి పెద్దవాళ్ళు మన ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మ చూపిస్తున్నారు"...***

ఇది వైసీపీ అధినేతపై ఒకప్పుడు ఓ మహిళ చేసిన కామెంట్. ఇప్పుడామె అదే వైసీపీ శాసనసభ్యురాలు, మంత్రి కూడానండోయ్.

***"ఖబడ్దార్ చంద్రబాబు, తల్లక్రిందలుగా తపస్సు చేసినా నువ్వు ఇక ఈ జన్మలో ముఖ్యమంత్రివి కాలేవు. మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డే ఈ రాష్ట్రాన్ని 30 సంవత్సరాల పాటు పాలిస్తాడు. ప్రజల బాగోగుల కోసం ఆయన ఏది ఆదేశిస్తే.. అది మేము ఆచరిస్తాం. ఆయన మాకు కనిపించే దైవం. నా బొందిలో ప్రాణం ఉన్నంత వరకు నేను ఆయన భక్తుడిగానే ఉంటా. ఆయన జోలికి ఎవరైనా వస్తే తాట తీస్తా".***

ఇది ఒక శాసనసభ్యుడి ఆత్మఘోష. వైసీపీలో ఉన్నప్పుడు సాక్షాత్తూ అసెంబ్లీ సాక్షిగా ఆయన అన్న మాటలివి. ఇప్పుడు సదరు ఎంఎల్ఏ ప్రాణం పోలేదు కానీ, ఆయన మాత్రం వైసీపీని వీడి చంద్రబాబు పార్టీలోకి వెళ్లిపోయారు.

ఇలా ఒక పార్టీ, ఒక నేత అని కాదు. ప్రతి పార్టీలోనూ ఇంకొక పార్టీలోని నేతలని ఘాటుగా విమర్శించి మాట్లాడిన వ్యక్తులు, ఆ తరువాత తాము దూషించిన పార్టీ తీర్థం పుచ్చుకుని, తాము తిట్టిన నేతనే పొగుడుతూ చేసే భజన సంఘటనలు ఎన్నో మనం చూశాం.

ఇప్పుడు తాజాగా తెలుగురాష్ట్రాలలో అదే జరుగుతోంది. తెలంగాణలో మొన్నటి వరకు భాజపాని ఆడిపోసుకున్నవాళ్ళు కమలనాధుల చెంత చేరుతున్నారు. కాంగ్రెస్ పార్టీనీ, ఆ పార్టీ లీడర్లని నీచాతి నీచంగా తిట్టిన బిఆర్ఎస్ బృందం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటోంది. ఇక కేసీఆర్‌ని అతి తీవ్రమైన పదజాలంతో దూషించిన కాంగ్రెస్, భాజపా నేతలు 'జై కల్వకుంట్ల' అంటూ కారెక్కుతున్నారు. కేసీఆర్ ఆధిపత్య ధోరణి, అహంకారపు పోకడతో మౌనంగా వుండిన చాలా మంది ఇప్పుడు ఎన్నికలు సమీపించిన వేళ... ఆయనకి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు.

ఆంధ్రా విషయానికొస్తే ఇంకా ఎన్నికల నగారా మోగడానికే అయిదు నెలల కాలం వుంది కాబట్టి జంపింగ్ జిలానీలు కొంత సమయం తీసుకుంటారు. ఇక్కడ పార్టీలో చక్రం తిప్పుతున్న ఆ నలుగురి పైనా చాలామందికి పట్టలేనంత కోపం ఉన్నప్పటికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రధాన నేతలు గుంభనంగా ఉన్నా ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు నిదానంగా ఒక పార్టీ నుండి ఇంకొక పార్టీకి మారుతున్నారు.

## పాత తరం నాయకుల తీరే వేరు...!

నిజం చెప్పాలంటే ఒకప్పటి రాజకీయాలకి ప్రస్తుత రాజకీయాలకి చాలా వ్యత్యాసం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో ఒక్క నెల్లూరు జిల్లా విషయానికొస్తే రాజకీయ అరంగేట్రం చేసినప్పటినుండి ఒకే పార్టీ ఒకే జెండా సిద్ధాంతంతో పనిచేసిన నేతలు చాలామందే ఉన్నారు. ఉదాహరణకి స్వర్గీయ బెజవాడ గోపాలరెడ్డి, దివంగత పుచ్చలపల్లి సుందరయ్య, కీ॥శే॥ నేదురుమల్లి జనార్ధనరెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు లాంటి వాళ్ళు ఈ కోవకు చెందినవాళ్ళే. వాళ్లనే నమ్ముకుని వాళ్ళ వెంట నడిచిన వాళ్ళు కూడా అదే సిద్ధాంతాన్ని పాటించారు. ఒకవేళ తమ అనుచరులెవరికైనా తామో తమ పార్టీయో నచ్చక వేరే నాయకుడి చెంతకు, మరో పార్టీ నీడకో వెళ్తామంటే ముందుగా బుజ్జగించే ప్రయత్నం చేసే వాళ్ళు, ఆ తరువాత నిరభ్యంతరంగా వెళ్లమనే వాళ్ళు. వాళ్లపై కేసులుపెట్టి వేధించడమో, కక్షసాధింపులకు దిగడమో చేసేవాళ్ళు కాదు.

## నేటి పరిస్థితి పూర్తిగా విభిన్నం...!

ఇప్పుడు పరిస్థితి ఆలా లేదు. అధికారంలో ఉన్న తమ పార్టీ సిద్ధాంతాలో లేక పదవిలో వున్న తమ నాయకుడి నడవడికో నచ్చక ఎవరైనా ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలో కార్యకర్తలో పార్టీ మారుతున్నట్లు తెలిస్తే వెంటనే చర్యలు మొదలవుతాయి. వీలయితే దురాక్రమణ పేరుతో అతని వ్యాపార సముదాయమో, లేకుంటే ఇల్లో కూలగొట్టడం మొదటి అస్త్రం. ఒకవేళ అతనికి ఎలాంటి వ్యాపారం, సొంత ఇల్లు లేకుంటే ఏదో ఒక అక్రమ కేసు బనాయించి లోపల తోయించడం రెండవ అస్త్రం.

అదే సదరు లీడరుకి తమ పార్టీ విధానాలో, లేక పార్టీ అధినేత ప్రవర్తనో నచ్చకపోతే నిన్నటి వరకు తానే బండ బూతులు తిట్టిన పార్టీ జెండా కప్పుకుని వెళ్ళిపోతాడు. ఆయన వెంట ఆ పార్టీలోకి వెళ్లలేక, అప్పటివరకు ఉండిన పార్టీలో కొనసాగలేక మధ్యలో ఈ ద్వితీయ, తృతీయశ్రేణి నేతలు కార్యకర్తలు నలిగిపోతారు. తమ నాయకుడిని నమ్ముకుని పక్క పార్టీలోని స్థానిక లీడర్లని నోటికొచ్చినట్లు తిట్టడమే కాకుండా, వాళ్ళని చాలారకాలుగా ఇబ్బందులకు గురిచేసిన తాము, ఇప్పుడు వాళ్లకి మొహం ఎలా చూపించాలని కుమిలిపోతారు. ప్రధాన నేతలు మాత్రం పార్టీ మారిన వెంటనే సిగ్గు, శరం, మానం, మర్యాద లేకుండా నిన్నటి వరకు తనను తిట్టిన వారిని, తాను తిట్టిన వారిని వెనకేసుకుని తగుదునమ్మా అంటూ ఎన్నికల బరిలో దిగుతారు.

## పదవీకాంక్ష... అధికార దాహం...!

అధికార దాహం, పదవి వ్యామోహం వున్న వారికి నీతి, జాతి ఏమీ ఉండవు. పైన వుమ్మినా తుడిచేసుకుని వెళ్ళిపోతారు. వీరి మధ్యలో నలిగేది జనం మాత్రమే. జనానికి కావలసింది తగువులు, కొట్లాటలు కాదు. వాళ్ళు ఆశించేది తమకు అవసరమైన పనిచేసి పెట్టే నాయకుడు. అవసరమైతే తమకోసం నిలబడగలిగే లీడర్.

కానీ ఇప్పుడు లీడర్లు అలా లేరు. తమ స్వార్థంకోసం మధ్యలో వున్నవారిని

9 లో

# జగన్ తీరు..రాష్ట్రానికి నష్టం

## సోమిరెడ్డి విమర్శ




రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీరు రాష్ట్రానికి నష్టం కలిగిస్తోందని మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. కృష్ణాజలాల పున:పంపిణీ విషయమై సిపిఐ ఆధ్వర్యంలో కడపలో జరుగనున్న అఖిలపక్ష సదస్సుకు సంబంధించిన గోడప్రతులను ఆయన ఈనెల 17న నెల్లూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల కృష్ణాజలాలు కేటాయించారని, రాష్ట్ర విభజన తర్వాత 512 టీఎంసీలు కేటాయించారని, ఈ కేటాయింపులను పున:సమీక్షించాలని తెలంగాణ ప్రభుత్వం కోరడంతో కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో నీటి కేటాయింపులకు సంబంధించి రాష్ట్ర హక్కులపై ముఖ్యమంత్రి స్పందించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు షానవాజ్, సయ్యద్ సిరాజ్, మున్నా, గోపాల్, టీడీపీ ప్రధాన కార్యదర్శులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, వేనాటి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పల్లిపాడులో ముగిసిన సాంస్కృతిక పోటీలు




ఇందుకూరుపేట మండలం, పల్లిపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో ఇటీవల రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి పాత్ర పోషణ, జానపద నృత్య పోటీలు విజయవంతంగా ముగిశాయి. రాష్ట్ర విద్యా శాఖ(జనాభా విద్య) విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 13 డైట్‌ల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో రోల్ ప్లే విభాగంలో ఆత్మకూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమస్థానం పొందిందని, పల్లిపాడు డైట్ కళాశాల ద్వితీయస్థానంలో నిలిచిందని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రమేష్ తెలిపారు. అదేవిధంగా, ఫోక్ డాన్స్ విభాగంలో మొదటి స్థానం జడ్పీ ఉన్నత పాఠశాల–వావిళ్ళ, మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల– నిడిముసలి, జడ్పీ ఉన్నత పాఠశాల– విందూరు ద్వితీయ, తృతీయస్థానాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిల్చిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు,, కార్యక్రమ ఇన్‌ఛార్జ్ యస్.బోయదాస్, ఉపన్యాసకులు డి.నర్సింగరావు, కె.విజయచంద్ర, యన్.శివ, కె.షఫీ అహ్మద్, ఆఫీస్ సూపరింటెండెంట్ సురేష్, న్యాయ నిర్ణేతలు మేరీ మంజుల, ప్రసాద్, పద్మ తదితరులు పాల్గొన్నట్లు వివరించారు.

# పాత పెన్షన్ సాధనే ధ్యేయం

## రిలే దీక్షలకు యుటిఎఫ్ సమాయత్తం



సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేయడంతో పాటు, పాత పెన్షన్‌ను కొనసాగించాలని యుటిఎఫ్ కోరుతోంది. పాత పెన్షన్‌ను సాధించేందుకు ఉద్యమాలు చేపట్టాలని సిద్ధమవుతోంది. నెల్లూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో ఈనెల 17న జరిగిన సమావేశంలో యుటిఎఫ్ నేతలు మాట్లాడుతూ, సీఎం జగన్ హామీ ఇచ్చినా సిపిఎస్‌ను రద్దుచేయకుండా, జీపీఎస్ తీసుకురావడం అన్యాయమని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి నవకోటేశ్వరరావు చెప్పారు. సిపీఎస్, జీపీఎస్‌లకు పెద్ద తేడా ఏమీ లేదని, రాష్ట్రంలోని లక్షలాదిమంది ఉద్యోగ ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానాన్నే కోరుకుంటున్నారన్నారు. దానిని సాధించేందుకు యుటిఎఫ్ ఆందోళనకు సమాయత్తమవుతోందని, ఈనెల 20 నుంచి నిరవధిక రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నామని తెలిపారు. అనంతరం యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలకు సంబంధించిన జ్ఞాపికను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి చలపతిశర్మ, గౌరవాధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఎంసీ అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా దసరా వేడుకలు

## • ఆలయాలకు శరన్నవరాత్రుల శోభ





**దసరా పర్వదినాలను పురస్కరించుకుని జిల్లాలోని వాడవాడలా ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారు. ఆలయాల్లో శరన్నవరాత్రుల వేడుకలు దేదీప్యమానంగా జరుగుతున్నాయి. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన పెంచలకోన శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయం, జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవాలయం, నరసింహ కొండలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం తదితర అన్ని ప్రఖ్యాతమైన ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు కనువిందుగా జరుగుతున్నాయి. విశేష అలంకారాలు, ప్రత్యేకపూజలతో, విద్యుద్దీపాలంకరణలతో, పెద్దసంఖ్యలో వచ్చే భక్తుల రాకపోకలతో ఆలయాలు కళ కళలాడుతున్నాయి.**

శరన్నవరాత్రుల సందర్భంగా నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం భక్తుల రాకపోకలతో క్రిక్కిరిసిపోతోంది. ప్రత్యేక పూజలతో, విశేష అలంకారాలతో అమ్మవారి ఆలయం మెరిసిపోతోంది. ఈనెల 15 నుంచి ప్రారంభమైన శరన్నవరాత్రుల వేడుకలు ఈనెల 23వరకు జరుగనున్నాయి. ఈనెల 21న కాళికాదేవి అలంకారం, 22న దుర్గాష్టమిని పురస్కరించుకుని శ్రీ దుర్గాదేవి అలంకారం, మహిషాసురమర్ధిని అలంకారాలతో అమ్మవారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. 23న విజయదశమి పర్వదినం రోజున అమ్మవారికి వేకువన 4 గంటలకు అంగరంగవైభవంగా 'మహాభిషేకం' నిర్వహించనున్నారు. శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారం మరింత శోభాయమానంగా ఉంటుంది. ఆరోజున విశిష్టంగా శమీ పూజ, పారువేట, అనంతరం అమ్మవారికి జరిగే నగరోత్సవం భక్తాదులకు కన్నుల పండువ చేయనుంది. ఈ వేడుకల్లో స్థానిక ప్రముఖులు, రాజకీయ నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, ముఖ్యంగా మహిళా భక్తులు వేలసంఖ్యలో పాల్గొంటుండడం విశేషం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. అమ్మవారి దర్శన ఏర్పాట్లలో ఎలాంటి అసంతృప్తులు లేకుండా ఆలయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

అదేవిధంగా, నెల్లూరు చెరువుగట్టున వెలసివున్న సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల అమ్మవారి దేవస్థానం, మూలాపేటలోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయం, ధర్మరాజు స్వామి దేవస్థానం, నవాబుపేటలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయం, స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం, సీఏఎం హైస్కూలు రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవాలయం, నవాబుపేటలోని శ్రీ ధర్మరాజస్వామి దేవాలయం, కోదండరామపురంలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం, సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయం, విరాట్‌నగర్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం, బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామస్వామి దేవస్థానం, వేదాయపాళెంలోని అయ్యప్ప గుడిలో ఉన్న గురువయూర్ మహావిష్ణు, మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, వెంకటేశ్వరపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం తదితర అన్ని ఆలయాల్లో విశేష అలంకారాలు, పూజలు జరుగుతున్నాయి.



## కలువాయి ఉపాధ్యాయునికి..

# బోయి భీమన్న పురస్కారం

తిరుపతి జిల్లా భాకరాపేట ఉషోదయ ఫౌండేషన్ వారు తెలుగు సాహిత్యం, కళారంగాల్లో విశేష కృషిచేస్తున్నవారికి ప్రదానం చేసే డా. బోయి భీమన్న పురస్కారాన్ని ఈసారి నెల్లూరుజిల్లా కలువాయిలోని బివిఎన్‌ఆర్ జడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఎం. రత్నయ్యకు ప్రదానం చేశారు. భాకరాపేట అర్జునమహల్‌లో ఈనెల 15న ఆయన ఆ పురస్కారాన్ని అందుకున్నారు. రత్నయ్య సేవలకు గుర్తింపుగా ఈ అవార్డునిచ్చి సన్మానించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా.డి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తుండాలని, వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని డిస్కం సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయన్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈనెల 17న ఆయన నెల్లూరులోని విద్యుత్‌భవన్‌లో ఆ శాఖ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏపీఎస్పీడిసిఎల్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జియోట్యాగింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేయాలని, విద్యుత్ సరఫరాలో ఏవైనా సమస్యలుంటే మిత్ర యాప్‌లో పొందుపరచాలని, వ్యవసాయ సర్వీసులను ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లకు అనుసంధానం చేయాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రి, బాలచంద్ర, సీనియర్ అకౌంటెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటే.. బటన్ నొక్కుడు కాదు

## సీపీఎం రాష్ట్ర నాయకుడు గఫూర్ విమర్శ




అభివృద్ధి అంటే బటన్ నొక్కుడు కాదని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల పురోగతి కోసం చర్యలు తీసుకుని రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషిచేస్తేనే అది అభివృద్ధి అవుతుందని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు ఎం.ఏ గఫూర్ అన్నారు. ఇటీవల జిల్లాలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున చేపట్టిన పాదయాత్రల ర్యాలీలు నెల్లూరుకు చేరుకున్న అనంతరం స్థానిక నర్తకిసెంటర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను మానుకోవాలని, లేదంటే ప్రజలే వారికి గుణపాఠం చెప్తారని ఆయన అన్నారు. కేంద్రం రాష్ట్రాభివృద్ధికి ఇస్తున్న అరాకొర నిధులను కూడా సీఎం జగన్ పక్కదారి పట్టిస్తున్నారని, గ్రామపంచాయతీలకు వచ్చిన నిధులను కూడా లాగేసుకుంటున్నారని, దీంతో గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయిందని విమర్శించారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు అవస్తలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సాగునీటి వనరులను పరిరక్షించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం తీరుమార్చుకుని ప్రజల అభ్యున్నతికి కృషిచేయాలన్నారు. సీపీఎం జిల్లా నాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, రమాదేవి, రెహనాబేగం, శ్రీనివాసులు తదితరులు ఈ పాదయాత్రల్లో పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు తీర్చాలంటూ ఇటీవల ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రీజనల్ కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నాందోళన చేపట్టారు. జిల్లా పరిధిలోని కొందరు అధికారులు ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరు బాగా లేదన్నారు. దీనిపై నిరసనలు చేపడుతున్నా, ఉన్నతాధికారులకు ఆ విషయం తెలిపినా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ ఆందోళనలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యపరెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాజశేఖర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం




భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, భారత అణుశాస్త్ర పితామహుడు ఏపీజే అబ్దుల్ కలాం 92వ జయంతి కార్యక్రమాన్ని ఇటీవల నెల్లూరులోని 10–ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి వారు ఘనంగా నిర్వహించారు. నగరంలోని కెఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల బీవీ నగర్ అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తౌలుత, వేదాయపాళెం సెంటర్‌లో మున్సిపల్ పార్కు వద్ద ఉన్న ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ, అబ్దుల్‌కలాం భారత అణు శాస్త్రవేత్తగా, గొప్ప దేశభక్తునిగా పేరొంది, అత్యున్నతమైన రాష్ట్రపతి పదవినధిష్టించి దేశానికి మహోన్నత సేవలందించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని, ఆ మహనీయుని అడుగుజాడలలో విద్యార్థులు నడవాలని ఆకాంక్షించారు.

## పార్కులను బాగుచేయండి

నెల్లూరు నగరంలోని రామలింగాపురం, ముత్యాలపాళెం, శ్రీహరి నగర్‌లలో ఉన్న పార్కులు చెత్తతో నిండిపోయి డంపింగ్‌యార్డులుగా మారాయని, వాటిని ఆధునీకరించాలని 19వ డివిజన్ కార్పొరేటర్ మూరంరెడ్డి జ్యోతిప్రియ ఈనెల 16న జరిగిన స్పందన కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ చెన్నుడుకు విజ్ఞాపన పత్రం సమర్పించారు.

## డీసీసీ అధ్యక్షునిగా.. మళ్ళీ చేవూరు



జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షునిగా మరోసారి చేవూరు దేవకుమార్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ గిడుగు రుద్రరాజు ఇటీవల ఆమేరకు ఆదేశాలు జారీచేశారు. 2019లో డీసీసీ అధ్యక్షునిగా దేవకుమార్‌రెడ్డి ఎన్నికై, పార్టీ పటిష్టతకు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయన్ను మరోసారి అధ్యక్షునిగా నియమించడం పట్ల జిల్లా కాంగ్రెస్ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అదేవిధంగా పీసీసీ (ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ) ఉపాధ్యక్షునిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ శాసనసభ్యులు సీవీ శేషారెడ్డిని, ఉడతా వెంకట్రావును నియమించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శిగా చేవూరు శ్రీధర్‌రెడ్డి ఎంపికయ్యారు.

### విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు..

## సారంపాటి వీరన్నాచారి విద్యానిధి

పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు నెల్లూరులోని శ్రీ సారంపాటి వీరన్నాచారి విశ్వబ్రాహ్మణ విద్యానిధి తమవంతు చేయూతనిస్తోంది. తాజాగా ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలోని 32 మంది పేద విద్యార్థులకు 48 వేల రూపాయలను ఉచితంగా అందజేయాలని ఈనెల 15న జరిగిన పాలకవర్గ సమావేశం నిర్ణయించిందని, ఇంటర్–డిగ్రీ–బీటెక్–ఎంసిఏ–బీపీటీ, పాలిటెక్నిక్ కోర్సులు చదువుకుంటున్నవారికి ఆ సాయాన్ని అందజేస్తామని విద్యానిధి ప్రెసిడెంట్ ఇనుకొండ చక్రపాణి తెలిపారు. ఇందులో కొంత దాతల విరాళం కూడా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యానిధి ప్రతినిధులు టి. కొండాచారి, వి. శ్రీనివాసాచారి, వి. నారాయణరావు, హరికుమార్, దయానంద తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు సిఐలు.. నలుగురు ఎస్ఐల బదిలీ

జిల్లాలో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఈనెల 17న ఉత్తర్వులిచ్చారు. నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.మధుబాబును తిరుపతిజిల్లా సూళ్ళూరుపేట సిఐగా, కోవూరు సీఐగా ఉన్న కె.రామకృష్ణారెడ్డిని స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్–1గా నియమిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా, కలువాయి ఎస్ఐ బి.మహేంద్రను బుచ్చిరెడ్డిపాళెంకు, బుచ్చిలో పనిచేస్తున్న కె.వీరప్రతాప్‌ను కొడవలూరుకు, కొడవలూరులో ఉన్న జి.సుబ్బారావును నెల్లూరు విఆర్‌కు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ డా.కె. తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాలిచ్చారు. ఆత్మకూరు ఎస్ఐ వి.రాజేష్‌ను సౌత్‌ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో నియమించారు.

### ఆదాల ఔదార్యం



## రెడ్‌క్రాస్‌కు రూ. 21.5 లక్షల వ్యాన్

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలోని మానసిక దివ్యాంగుల స్కూల్ చిన్నారుల కోసం నెల్లూరు ఎంపీ, రూరల్ వైకాపా సమన్వయకర్త ఆదాల ప్రభాకర్ రెడ్డి 21.5 లక్షల రూపాయల విలువచేసే వ్యాన్‌ను ఈనెల 16న వితరణగా ఇచ్చి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. గతంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ఆయన స్కూల్‌కు వాహనసదుపాయాన్ని సమకూర్చడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్, శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా ఆదాలకు కృతజ్ఞతలు తెలిపారు.

## కరెంట్ చార్జీలతో.. నిలువుదోపిడీ


### సీపీఐ నిరసనలు



రకరకాల పేర్లతో కరెంటు చార్జీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను నానా అవస్థలకు గురిచేస్తోందని సీపీఐ నాయకులు విమర్శించారు. కరెంటు చార్జీల పెంపుకు నిరసనగా ఇటీవల నెల్లూరులో సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో సిపిఐ నగర కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి మాట్లాడుతూ, యూజర్‌చార్జీలని, సర్‌చార్జీలని కరెంటు చార్జీలు భారీగా పెంచుతూ ప్రభుత్వం ప్రజలను నిలువుదోపిడీ చేస్తోందని దుయ్యబట్టారు. అందుకు నిరసనగా సీపీఐ ఆందోళనలు చేస్తోందని, ప్రభుత్వం ఇకనైనా మొండివైఖరి మానుకొని ఆ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామరాజు, ఆంజనేయులు, జిలానీ, బాషా, నాగేంద్రబాబు, ముక్తియార్, సతీష్, సుబ్బరాయుడు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 77వ భాగం

ద్రౌపది తనను ధృతరాష్ట్రుడు కాపాడుతాడని ఎంతో ఎదురుచూసినా, ఆయన మౌనంగా ఉండిపోతాడు. దుర్యోధనుడు దుశ్శాసనుణ్ణి పిలిచి ద్రౌపదిని సభామధ్యలోకి తీసుకురమ్మని ఆదేశిస్తే ద్రౌపది భయపడిపోయి, గాంధారి అంతఃపురానికి పరిగెడుతుంది. దుశ్శాసనుడు ఆమె వెంట వెళ్లి ఆమెను జుట్టు పట్టుకొని ఈడ్చుకుంటూ సభలోకి తీసుకువస్తాడు.




ద్రౌపది సభాసదులను దీనంగా అడుగుతుంది.. ధర్మరాజు తన్నోడి నన్నోడేనా, లేక నన్నోడి తన్నోడేనాయని. భీష్ముడు తటస్థంగా ఉండిపోతాడు. అప్పుడు దుశ్శాసనుడు మరింతగా రెచ్చిపోయి దాసి దాసి అని జుట్టు పట్టుకొని లాగుతుంటాడు. భీముడు ఒక్కసారిగా లేచి అన్నగారి మీద కోపించి దీనికంతటికి నీవే కారణం అంటూ నీ చేతులు కాల్చెయ్యాలని సహదేవుని నిప్పు తీసుకురమ్మంటాడు.

కానీ, అర్జునుడు భీమసేనుని శాంతింపచేస్తాడు... ధర్మరాజు ధర్మం తప్పినప్పుడు భూలోకమంతా ప్రళయం సంభవించదా అని.




భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.

## గుండెజబ్బులతో జాగ్రత్త

గుండెజబ్బుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని నెల్లూరు ప్రభుత్వ వైద్యకళాశాల అనస్థీషియా హెచ్ఓడి శ్రీనివాసరావు సూచించారు. అంతర్జాతీయ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా ఈనెల 16న ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుండెపోటుకు గురైన సమయంలో అత్యవసర చికిత్స (సిపిఆర్) చేయాలని, గుండెజబ్బులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వసుంధర, ఆసుపత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్, ప్రొ.జమున, ప్రొ. శాంతి, కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మధుమేహ వ్యాధిపై అవగాహన




నెల్లూరులోని ఏసీ స్టేడియంలో ఈనెల 15న ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధుమేహవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వ్యాధి వల్ల కాళ్లకు వచ్చే ఇన్‌ఫెక్షన్లు, ఆనెలు, పుండ్లు తదితర సమస్యలను వివరిస్తూ, వాటి నివారణకు ఏం చేయాలో డాక్టర్ బైనముడి మనోహర్ వివరించారు. అసోసియేషన్ అధ్యక్షులు తలపనేని హరిబాబునాయుడు, కార్యదర్శి బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కోశాధికారి షేక్ నజీర్ అహమ్మద్, నలుబోలు బలరామయ్యనాయుడు, ఆర్‌సి రాఘవరెడ్డి, చెంచయ్యనాయుడు, కిలారి శ్రీనివాసులునాయుడు, పులగల సుబ్బారావు పాల్గొన్నారు.

# సీఎం కృషితో.. ప్రజల చెంతకే వైద్యం



## - కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

రాష్ట్ర ప్రజల మేలు కోసం ముఖ్యమంత్రి జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైనవారందరికి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన కోవూరు మండలం జమ్మిపాళెంలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు వైద్య సదుపాయాలు, మందులు అందుతున్న తీరును పరిశీలించారు. వైద్యం కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా వారి ఇంటి వద్దే మెరుగైన వైద్యం అందించడానికి ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నారని, ప్రజల ఇళ్ళ వద్దే వైద్యపరీక్షల ద్వారా అనారోగ్య సమస్యల్ని గుర్తించి వారికి 5 దశల్లో ఉచితంగా 7 రకాల పరీక్షలు అందించే వైద్య సదుపాయాలతో పాటు, తగు ఆరోగ్య సలహాలు సూచనలు కూడా ఇస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# జగనే కావాలి..జగనే రావాలి

## నేదురుమల్లి రామ్

రాష్ట్రాభ్యుదయానికి జగనే కావాలని, ముఖ్యమంత్రిగా మళ్ళీ జగనే రావాలని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌బోర్డు ఛైర్మెన్, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి' అనే విషయంపై కార్యకర్తలు, నాయకులు ఇంటింటి ప్రచారం చేయాలని, జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలను, రాష్ట్రాభ్యున్నతికి చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 18న రాపూరు మండలంలో వైకాపా మండలాధ్యక్షులు, సర్పంచ్‌లు, ఇతర సీనియర్ నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ-వార్డు వలంటీర్లు తదితరులతో ఏర్పాటైన మండలస్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ముఖ్యమంత్రిగా జగన్ వస్తే ప్రజలకు, రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆమేరకు ప్రజల్లో చైతన్యం కలిగించాలని వారికి దిశానిర్దేశం చేశారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి..

# పట్టువస్త్రాలు సమర్పించిన ఎంపీ ఆదాల

## • అమ్మవారి పంచలోహ విగ్రహ తయారీ కరపత్రం ఆవిష్కరణ





దసరా ఉత్సవాల సందర్భంగా నెల్లూరు దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న శరన్నవ రాత్రుల మహోత్సవాల్లో నెల్లూరు ఎంపీ, రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈనెల 16న ఆయన ఆలయాన్ని సందర్శించి భవాని అలంకారంలో వెలుగొందుతున్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం, దేవస్థానంలో తయారుచేయనున్న అమ్మవారి పంచలోహ విగ్రహ తయారీకి సంబంధించిన కరపత్రాన్ని దేవస్థానం పాలకమండలి ఛైర్మెన్, సభ్యుల సమక్షంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాలకు ఆలయ నిర్వాహకులు, అధికారులు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్, కొండ్రెడ్డి రంగారెడ్డి, మేయర్ పోట్లూరి స్రవంతి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సేవాసమితి అధ్యక్షులు సన్నపరెడ్డి పెంచలరెడ్డి, వైవి రామిరెడ్డి, నెల్లూరు మదన్ మోహన్‌రెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు టీవీఎస్ కమల్, నందూరి హరితరెడ్డి, ముంగమూరు భార్గవిరెడ్డి, జిల్లా వైఎస్ఆర్సీపి మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి, కో-ఆప్షన్ సభ్యురాలు సయ్యద్ మొబినా తదితరులు పాల్గొన్నారు.

# జీవీకే చిన్మయ విద్యాలయంలో.. రహదారి భద్రతపై అవగాహన



ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరులో ఉన్న జీవీకే చిన్మయ విద్యాలయంలో జరుగుతున్న ఎన్‌సిసి 24వ బెటాలియన్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు ఈనెల 17న రహదారి భద్రతపై అధికారులు అవగాహన కల్పించారు. నెల్లూరు ఉప రవాణా కమిషనర్ చందర్ సూచనలతో మోటార్ వాహనాల తనిఖీ అధికారి కె.మురళీమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని రోడ్డుమీద ప్రయాణాలు చేస్తున్నప్పుడు ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులకు సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు అతివేగం, నిర్లక్ష్యం పనికిరావన్నారు. ప్రమాదాల్లో మరణాలు సంభవిస్తుంటాయని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవడం అలవాటు చేసుకోవాలని సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారి రఘువర్ధన్‌రెడ్డి చెప్పారు. డ్రైవింగ్ చేసేవారితో పాటు వారి వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. విద్యార్థులు మంచి నడవడిక, క్రమశిక్షణతో ఉత్తమపౌరులుగా రాణించాలని, రహదారి భద్రత అందరి బాధ్యతగా గుర్తించి ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా ఉండాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న 24వ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ కమాండెంట్ ఎస్ఆర్ఐ సునీల్‌కుమార్ వివరించారు. సుబేదార్ మేజర్ ఎస్ఎం రాజేష్‌కుమార్, చీఫ్ ఆఫీసర్ బాలబ్రహ్మాచారి, ఎన్‌సిసి ఆఫీసర్లు హరీష్‌రెడ్డి, పెంచలపుల్లయ్య, జావీద్, దీప్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రహదారి భద్రతను పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

# 'గ్లోబల్ ఫ్రీ జోన్ ఆఫ్ ది ఇయర్'గా శ్రీసిటీ




అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవాడగా ఉన్న శ్రీసిటీకి ఈనెల 16న మరో అరుదైన ఖ్యాతి లభించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో 'అత్యుత్తమ గ్లోబల్ ఫ్రీ జోన్ ఆఫ్ ది ఇయర్'గా శ్రీసిటీకి ప్రత్యేక గుర్తింపు దక్కింది. ఎఫ్‌డిఐ ఇంటెలిజెన్స్ సంస్థ వారి 'గ్లోబల్ ఫ్రీ జోన్స్ ఆఫ్ ది ఇయర్ 2023' 10వ ఎడిషన్‌లో శ్రీసిటీకి ఈ ఘనత లభించడం విశేషం. ఎఫ్‌డిఐ ఇంటెలిజెన్స్ అనేది ప్రపంచంలోని పారిశ్రామిక జోన్లు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించి అత్యంత ప్రాచుర్యం కలిగిన ప్రచురణ సంస్థ. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైనకేంద్రాలు, వ్యాపార విస్తరణ, ఆర్థిక అభివృద్ధికి మెరుగైన అవకాశాలు కలిగిన ప్రాంతాలను ఇది గుర్తిస్తుంది. ఈ ఏడాది 90 దేశాల్లోని 4921 వ్యాపార కేంద్రాలను పరిగణనలోనికి తీసుకుని, పలు విభాగాలలో ఉత్తమ జోన్‌లను ఈ సంస్థ ప్రత్యేకించడంతో శ్రీసిటీ పారిశ్రామికవర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి. ఎఫ్‌డిఐ గుర్తింపు దక్కడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ, అంతర్జాతీయ ఆర్థిక రంగంలో అత్యంత వ్యూహాత్మక, అనువైన పారిశ్రామిక ప్రాంతాల ప్రాముఖ్యతను ఇది తెలియచేస్తుందని, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడులను ఆకర్షించడం, ఆర్థిక పురోగతిని ప్రోత్సహించడంలో పర్యావరణ అనుకూల విధానాలు ఎలా ప్రభావితం చేస్తాయో శ్రీసిటీ ద్వారా నిరూపణ కావడంతో పాటు, శ్రీసిటీ పారిశ్రామిక విజయగాథ ఇతర అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు ఒక మార్గదర్శిగా నిలుస్తుందని అన్నారు.

శ్రీసిటీ భౌగోళిక అనుకూలతలను ప్రస్తావించిన ఎఫ్‌డిఐ ఇంటెలిజెన్స్, గత ఏడాదిలో వివిధ రంగాలలో ఉత్పాదక పరిశ్రమల వృద్ధి పట్ల శ్రీసిటీని ప్రశంసించింది. విద్యుత్, నీరు, మురుగునీటి కనెక్షన్‌ల వంటి అవసరమైన సౌకర్యాలతో కూడిన 'రెడీ బిల్ట్' ఫ్యాక్టరీలను అందించడం ద్వారా శ్రీసిటీ వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలను ఆకర్షిస్తోందని, ఇంకా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం, అంతర్గత కస్టమ్స్ క్లియరెన్స్ సింగిల్ విండో సౌకర్యాన్ని కలిగి ఉండడం శ్రీసిటీ ప్రత్యేకతలని పేర్కొంటూ అభినందించారు.

# కోవూరులో వాహనదారులకు సీఐ క్లాస్

కోవూరులో వాహనదారులకు సీఐ రామకృష్ణారెడ్డి ఈనెల 15న క్లాస్ పీకారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే అలాంటివారిని గుర్తించి కేసులు నమోదు చేయడం జరిగిందని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమన్నారు.




# ఎన్‌బికెఆర్ విద్యార్థిని ప్రతిభ

## - శ్రీలంకలో ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన అనిత



కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్స్టిట్యూట్‌లో బీటెక్ ఆఖరిసంవత్సరం చదువుతున్న విద్యార్థిని సత్తెనపల్లి అనిత శ్రీలంకలో ఇటీవల నిర్వహించిన గ్లోబల్ వలంటీర్ ప్రోగ్రామ్‌కు ఎంపికైందని కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. అయిసెక్ అనే స్వతంత్రంగా లాభాపేక్షలేని రాజకీయేతర యువత నిర్వహించే గ్లోబల్ సంస్థతో తమ కళాశాల మూడేళ్ల క్రితం అవగాహన ఒప్పందం చేసుకుందని, 110 దేశాల్లో విస్తరించి ఉన్న ఈ సంస్థ యువ నాయకత్వాన్ని అభివృద్ధి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ సంస్థలో తమ కళాశాలకు చెందిన 65 మంది విద్యార్థులున్నారని, వీరికి కళాశాలలో అనేక పోటీలు పెట్టి మెరుగుపెట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అనిత అక్కడ ఇంటర్న్‌షిప్ సాధించినట్లు పేర్కొన్నారు. 40 రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఈజిప్ట్, వియత్నాం, టర్కీ తదితర దేశాల నుంచి కూడా విద్యార్థులు పాల్గొన్నారని, ప్రతిష్టాత్మకమైన ఈ ఇంటర్న్‌షిప్‌ను అనిత విజయవంతంగా పూర్తిచేసి, తిరిగి భారత్‌కు వచ్చిందని ఆ విద్యార్థినిని ఆయన అభినందించారు. కన్వీనర్ డా.ఎన్ కిషోర్‌ధర్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అనుమసముద్రంపేట (ఏఎస్‌పేట) లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈనెల 15న పాఠశాలలో కలుసుకుని కేకు కట్‌చేసి అందరికీ పంచారు. తమ పాఠశాల చదువుల నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందించారు. దాదాపు 18 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఆత్మీయంగా మాట్లాడుకుంటూ, ఎవరెవరు ఎక్కడెక్కడ ఉద్యోగాలు చేస్తున్నారో, ఎక్కడ స్థిరపడ్డారో ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఆ రోజంతా స్నేహభావంతో ఆనందంగా గడిపారు.



## ఆదర్శ పాఠశాలకు..

# నాలుగు స్వర్ణాలు

సీతారామపురం ఏపీ ఆదర్శ పాఠశాల ఇంటర్ విద్యార్థులు ఇటీవల తెనాలిలో జరిగిన జాతీయస్థాయి జంప్‌రోప్ పోటీల్లో ఏకంగా నాలుగు బంగారుపతకాలు సాధించి ఔరా అన్పించారు. అండర్ 16 లాంగ్‌రోప్ స్పీడ్ రిలే విభాగంలో జోనీ శారోన్, హారిక, తేజేశ్వరి, మాధురి ఈ బంగారు పతకాలను సాధించినట్లు పాఠశాల పీడీ రవికుమార్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

## ఇందిరాభవన్‌లో

# సంబరాలు

నెల్లూరుజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన చేవూరు దేవకుమార్‌రెడ్డికి పార్టీ వర్గాలు శుభాకాంక్షలు చెప్తూ నెల్లూరులోని ఇందిరాభవన్‌లో సంబరాలు జరుపుకున్నాయి. కాంగ్రెస్ పార్టీలో 40 సంవత్సరాలకు పైగా రాజకీయ అనుభవం కలిగిన చేవూరుకు మళ్ళీ డిసిసి పదవి కట్టబెట్టడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. క్రమ శిక్షణ, నిబద్ధత కలిగిన నాయకునిగా, జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి ఆయన తీసుకుంటున్న చర్యలను కొనియాడారు.

# వృద్ధులకు సాయం అందించిన.. డిఆర్ తనయులు



ప్రముఖ విద్యాదాత డిఆర్ కుమారులు వినయ్‌కుమార్‌రెడ్డి, విద్యాధర్‌కుమార్‌రెడ్డిలు ఈనెల 15న తమ తండ్రి పేరుతో 60 మంది నిరుపేద వృద్ధులకు 70 వేల రూపాయల విలువచేసే బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీచేసి తమ సేవాభావం చాటుకున్నారు. కావలిలోని డిఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో వెంగళరావునగర్‌లోని కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. పేదవృద్ధులకు సాయం చేస్తున్న డిఆర్ తనయులకు ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది బాబురావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ వినయకుమార్‌రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, రామ్ సెంటర్ ఛైర్మెన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, విష్ణు, సతీష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంగ్ల కవితా సంపుటి ఆవిష్కరణ



నెల్లూరుకు చెందిన పన్నెండేళ్ళ బాలిక మోపూరు సాయిహర్షిత రచించిన ఆంగ్ల కవితా సంపుటి 'ఇంక్ ఔట్ ఆఫ్ మై పెన్'ను ఇటీవల నగరంలో ఆవిష్కరించారు. ప్రముఖ కవి మోపూరు పెంచలనరసింహం తమ్ముడు శ్రీనివాసులు కుమార్తె సాయి హర్షిత 5వ ఏట నుంచే ఆంగ్లంలో కవితలు రాయడం విశేషం. ఈ పుస్తకంలో 50 కవితలున్నాయి. నాయనమ్మ పెంచలలక్ష్మి తొలి ప్రతి స్వీకరించగా, అవ్వారు శ్రీధరబాబు పుస్తకాన్ని సమీక్షించారు. కవయిత్రి గోవిందరాజుల సుభద్రాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కార్టూనిస్ట్ రామ్‌శేషు, ఇంద్రగంటి మధుసూదనరావు, తోట సులోచన తదితరులు పాల్గొన్నారు

---

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## దళితులకి న్యాయం...

# జగనన్నతోనే సాధ్యం

### తిరుపతి ఎంపీ గురుమూర్తి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ బస్సు యాత్ర జరగనున్న నేపథ్యంలో ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలకి సంబంధించిన సన్నాహక సమావేశం ఇటీవల నెల్లూరు కస్తూరిదేవి పాఠశాల ఆవరణంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా దళితులందరూ ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని, అందుకు కారణం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా రాజకీయ పదవులలో ప్రాధాన్యం లాంటి ఎన్నో ప్రయోజనాలను పొందడమే కారణమని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి లాంటి ఎన్నో కార్యక్రమాలు నేడు కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అమలవుతున్నాయని, ఇవి ఇలాగే కొనసాగాలంటే మరోసారి జగన్‌ని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, వెలగపల్లి వరప్రసాదరావు, ఎమ్మెల్సీలు మేరిగ మురళి, బల్లి కళ్యాణ్, అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ, షెడ్యూల్డ్ కులాల కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ జూపూడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంసెట్ 3వ విడత కౌన్సిలింగ్ నిర్వహించాలి

## - టిఎన్ఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు లల్లు యాదవ్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన ఎంసెట్ 3వ విడత కౌన్సెలింగ్‌ను వెంటనే నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలంటూ గూడూరు రెవెన్యూ డివిజనల్ అధికారికి ఇటీవల టిఎన్ఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు లల్లు యాదవ్ వినతిపత్రం సమర్పించారు. ఇప్పటివరకు ఉన్న ప్రభుత్వాలు ఎంసెట్ కౌన్సిలింగ్‌ని 3 విడతలుగా జరుపుతూ వచ్చాయని, కానీ ఇప్పుడు జగన్ సర్కార్ 3వ విడత కౌన్సిలింగ్‌ని రద్దు చేయడం అన్యాయమని, ఈ విషయమై 13 వేల మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వానికి వినతిపత్రాల ద్వారా విన్నవం చేసుకున్నా పట్టించుకోకపోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 3వ కౌన్సిలింగ్ నిర్వహిస్తాం అని చెప్పిన విద్యాశాఖ మంత్రి అంబటి రాంబాబు ఎందుకు మౌనంగా ఉన్నారో తెలియడం లేదని, విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడటం సరికాదంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వసీం, ఖాజా, మహేష్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

గూడూరు మండల పరిధిలోని కుమ్మర కులస్తులకు ధ్రువ పత్రాలను మంజూరు చేయాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 16వ తేదీ కుమ్మర కులస్తులు నిరసన వ్యక్తం చేసి ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఎస్టీలుగా పత్రాలు ఇచ్చినా ప్రస్తుతం ఇవ్వకపోవడంతో పథకాలు అందడంలేదన్నారు.



## ఉత్సాహంగా 'జెండా ఉత్సవం'

గూడూరు పట్టణంలో జెండా పండుగ ఉత్సాహంగా జరిగింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు ఆంజనేయస్వామి చిత్రాలను అలంకరించి ట్రాక్టర్లపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలతో గూడూరు, పరిసర ప్రాంతాలలో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి.

# దివ్యాంగులకు జేవీవీ కూరగాయలు

గూడూరు జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి నాగరాజు దాతృత్వంతో ఇటీవల గాంధీ స్మారక పాఠశాలలో 20 మంది దివ్యాంగులకు కూరగాయలు, కోడి గుడ్లు పంపిణీ చేశారు. భారత పెట్రోలియం శాఖ సూపరింటెండెంట్ డాక్టర్ కుడుముల నారాయణ చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, పురుషోత్తమరావు, గుర్రం విజయ్ బాబు, రాధయ్య, కటకం శ్రీను, నక్కా గోపి, సుబ్రహ్మణ్యం, సుధీర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పినాకినీ నదీజలాలతో..

## కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అభిషేకం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెల్లూరు స్టోన్‌హౌస్ పేటలో వెలసివున్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఈనెల 15న పినాకినీ నదీజలాలతో అభిషేకం నిర్వహించారు. రంగనాథ స్వామి దేవస్థానం వద్ద ఉన్న పెన్నానది పవిత్ర జలాలను కలశాలలో నింపి, 500 మంది మహిళాభక్తులు అమ్మవారికి అభిషేకం చేశారు. ఆలయ గౌరవాధ్యక్షులు, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, అధ్యక్షులు శ్రీరామ్ సురేష్, కార్యదర్శి సోమిశెట్టి రమేష్, ఒమ్మిన ఈశ్వర మురళీకృష్ణ, పేర్ల జనార్ధనరావు, కోట రమేష్‌బాబు, కనుమర్లపూడి కల్యాణి, జ్యోతిప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అమ్మవారు శ్రీ భవాని మాతగా భక్తులకు దర్శనమిచ్చారు.

## ప్రమాదాల సమయంలో జాగ్రత్తలు అవసరం



ప్రమాదాలు జరిగినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నెల్లూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.డి అబ్దుల్ సుబాన్ చెప్పారు. ఈనెల 17న ప్రపంచ ట్రామా దినోత్సవం సందర్భంగా నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను ఎలా రక్షించాలో ఆయన అవగాహన కలిగించారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటిస్తే, నిబంధనలను అనుసరిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ సదస్సులో డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ కృష్ణచైతన్య, డాక్టర్ కుమార్‌బాబు, డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ దినేష్, డాక్టర్ ధీరజ్, మెడికవర్ ఆసుపత్రి నెల్లూరు శాఖ అధిపతి ధీరజ్‌రెడ్డి, మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌సెంటర్ హెడ్ బిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్పాస్టిక్ సెంటర్‌లో అన్నవితరణ

నెల్లూరులోని రెడ్ క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లోని విద్యార్థులకు దాసరి అనంతపద్మనాభం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనెల 18న అన్నవితరణ చేశారు. స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ గురునాథ రావు, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, పద్మనాభం కుటుంబ సభ్యులు హైమావతి, దుర్గాప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.

## సత్యపథం

(4వ పేజీ తరువాయి)

బలిచేస్తున్నారు. తమనే నమ్ముకున్న వారి బలహీనతను ఆసరాగా చేసుకుని వారిని పక్క పార్టీలకి అమ్ముకోవాలని చూస్తున్నారు. పదవీ కాంక్షతో స్వార్ధపూరిత రాజకీయాలు చేస్తున్నారు. నిన్నటి వారి పార్టీలు, సిద్ధాంతాలు, పాలసీలు వేరైనా ఇద్దరూ ఒకే పార్టీ జెండా మోయవలసి వచ్చినప్పుడు దిగువస్థాయి పార్టీ శ్రేణులను, వీరిని నమ్మి ఓటేసిన జనాన్ని వెర్రిప్పాలని చేస్తున్నారు. వాళ్ళని వాళ్ళు ఒకరిని ఒకరు స్వాగతించుకుని, శాలువాలు కప్పుకుని సత్కారాలు చేసుకొని ఆలింగనం చేసుకుంటున్నారు. గతం మరిచిపోయి 'పదవే ధ్యేయం – పదవే లక్ష్యం' అన్న సిద్ధాంతంతో రాజకీయాల్లో కొనసాగుతున్నారు.

ఇప్పుడు చైతన్యం రావలసింది మనలోనే. మనల్ని మధ్యలో పెట్టుకుని దొంగలు దొంగలు ఒక్కటైపోతున్నారు. జనాన్ని అమాయకులని చేసి రాజకీయ పదవులను అడ్డం పెట్టుకుని దొరికిన మేరకు దోచుకుంటున్నారు. పదవీ దాహంతో ఉన్న బడా నాయకులలో మార్పు రాదు, స్వార్థం చావదు. వాళ్ళ కుటిల రాజకీయాలకి బలవుతున్న మనలోనే మార్పు రావాలి... మార్పు మనసుండే మొదలవ్వాలి. వాళ్ళు వాళ్ళు ఒక్కటే... మధ్యలో జనమే... అన్నది మనం గ్రహించాలి!

- రాజశ్రీ

## రిజర్వేషన్ బిల్లులో.. ఓబీసీ మహిళలకు అన్యాయం



మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశనం శంకర రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 18న నెల్లూరులో ఆ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహిళా బిల్లు వల్ల ఆధిపత్యకులాల వారికే న్యాయం జరిగిందని, 50శాతానికి పైగా ఉన్న ఓబీసీ మహిళలను విస్మరించడం సముచితం కాదని అన్నారు. జనాభా దామాషా ప్రకారం ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కోటా అమలుచేయాలని ఆయన కోరారు. సంఘం నాయకులు దేవరాల సుబ్రహ్మణ్యం, బ్రహ్మానందశర్మ, నాగమల్లేశ్వరరావు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు దొరికారు

### రూ. 5 లక్షల చోరీసొత్తు స్వాధీనం



రైతుల పొలాల్లో ఉన్న వ్యవసాయ మోటార్లను అపహరించుకుపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి వాటిలో ఉన్న రాగి, అల్యూమినియం తీగలను దొంగిలించుకుపోవడం వంటి నేరాలకు పాల్పడుతున్న ముఠా పోలీసులకు దొరికిపోయింది.

నెల్లూరు సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజా ఈనెల 18న ఆ వివరాలను వెల్లడించారు. కావలిలోని వెంగళరావునగర్, ఇందిరమ్మకాలనీ తదితర ప్రాంతాలకు చెందిన ఏడుగురు వ్యక్తులు వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడేవారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేకబృందాలతో గాలింపు చేపట్టామని, కావలి సమీపంలోని ముసునూరు రైల్వేట్రాక్ వద్ద ఉన్న ఈ ముఠాను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, వారు ఆ నేరాలు చేసినట్లు చెప్పారని ఆయన తెలిపారు. జలదంకి, ఏఎస్‌పేట, కావలి రూరల్, గుడ్లూరు, సైదాపురం ప్రాంతాల్లో వీరు చోరీలకు పాల్పడ్డారని వివరించారు. వారివద్ద నుంచి సుమారు 5 లక్షల రూపాయల విలువచేసే రాగి, అల్యూమినియం కేబుల్‌వైర్లను, వ్యవసాయ మోటార్‌ను, నేరాలు చేసేందుకు వారు వాడిన మోటార్‌బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కలిగిరి ఇన్‌స్పెక్టర్ ఫిరోజ్, క్రైమ్‌బ్రాంచ్ ఎస్ఐ ఉమాశంకర్, కొండాపురం–వింజమూరు ఎస్ఐలు ఖాజావలి, కోటిరెడ్డితో పాటు పోలీసుసిబ్బంది బృందాలుగా ఏర్పడి నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారని ఆయన చెప్పారు. నిందితులను అరెస్ట్‌చేసి, వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులను ఆయన అభినందించారు.

## క్యాన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన



బ్రెస్ట్ క్యాన్సర్‌పై విద్యార్థినులు అవగాహనతో ఉండాలని, ఆ వ్యాధిపట్ల అప్రమత్తత అవసరమని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి సూచించారు. ఈనెల 18న నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో విద్యార్థినులకు జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ, ఆ వ్యాధి పట్ల అవగాహన కలిగించారు. జీవనశైలి మారడం, ఆహారపు అలవాట్లు, సరిగా ఉండకపోవడం, వ్యాయామం లేకపోవడం వంటివి ఈ వ్యాధికి ముఖ్య కారణాలని పేర్కొన్నారు. క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ గీతా ఉషశ్రీ, డాక్టర్ హేమంత్, డాక్టర్ ముత్తు, డాక్టర్ హరితారాణి, ఆసుపత్రి కన్వీనర్ జుబేర్, కమలేష్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈత సరదా ప్రాణం తీసింది

- పెన్నలో మునిగి బాలుడు దుర్మరణం

ఈత సరదా ప్రాణం తీసింది. ఓ బాలుడి దుర్మరణానికి దారితీసింది. దసరా సెలవులు కావడంతో సరదాగా ఈతకొట్టేందుకు పెన్నానదిలోకి దిగి ప్రమాదవశాత్తూ మునిగిపోయి మృతిచెందాడు. ఈనెల 18న ఈ దుర్ఘటన జరిగింది. నగరంలోని సంతపేటకు చెందిన అక్షయ్‌కుమార్ స్థానిక పిఎంఆర్ పాఠశాల విద్యార్థి. ఇంటిపక్కల ఉన్న స్నేహితులతో కలిసి పెన్నానదిలో ఈతకొట్టేందుకు వెళ్ళాడు. సాయంత్రమవుతున్నా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అంతా వెతికారు. స్థానికుల సమాచారంతో పెన్నానది వద్దకు వెళ్ళి అక్కడున్నవారిని విచారించారు. నది గట్టున అక్షయ్‌కుమార్ చెప్పులు, దుస్తులు కనిపించడంతో అనుమానం వచ్చి స్థానికుల సాయంతో నదిలో గాలించగా, రాత్రి 8 గంటల సమయంలో అక్షయ్ మృతదేహం బయటపడింది. దీంతో కుటుంబసభ్యులు పెద్దపెట్టున రోదించారు. సంతపేట పోలీసులు ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు.

## టూకీగా...



### అనంతసాగరం స్కూల్‌లో రికార్డుల పరిశీలన

అనంతసాగరం ఉన్నత పాఠశాలను ఇటీవల కావలి ఉప విద్యాశాఖ అధికారి రఘురామయ్య ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. పిల్లలకు పాఠ్యాంశాల బోధన ఎలా ఉందన్న విషయమై ఆరా తీశారు. ఉపాధ్యాయులకు తగు సూచనలిచ్చారు. ఎంఇఓలు బాలకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

### సంగంలో సచివాలయాల తనిఖీ

మండల కేంద్రమైన సంగంలోని సచివాలయాలను ఈనెల 16న తహశీల్దారు నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరును ఆరా తీశారు. సిబ్బంది డ్రెస్‌కోడ్ పాటించాలని, బయోమెట్రిక్ తప్పనిసరిగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

### పాముగుంటపాళెంలో ఉచితవైద్య శిబిరం

కావలి మండలం చెన్నాయపాళెం పంచాయతీలోని పాముగుంటపాళెం గ్రామంలో ఈనెల 16న కెఎంహెచ్ఎస్ వైద్యశాల వైద్యులు పద్మావతి కిరణ్, బాబుకిరణ్‌లు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేసి గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులిచ్చారు. ఎం.మాలకొండారెడ్డి, రెవ.ఎలీషా, డా.బి. జయసుందర్‌రావు, పాస్టర్ విన్సెంట్‌కుమార్ పాల్గొన్నారు.

### వడ్లపూడిలో జూదరుల అరెస్ట్

మనుబోలు మండలంలోని వడ్లపూడి వద్దనున్న అటవీ ప్రాంతంలో ఇటీవల డైమండ్‌డబ్బా జూదం ఆడుతున్న నలుగురు జూదరులను ఎస్ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్‌చేసి, వారి వద్ద నుంచి 82,800 రూపాయలతో పాటు, మూడు మోటార్‌బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

### బుచ్చిలో పేదరోగులకు పండ్లు పంపిణీ

మండల కేంద్రమైన బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరు శివాలయం వద్ద ఉన్న నిరుపేదలకు ఈనెల 16న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సిహెచ్ చెన్నయ్య ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు చెన్నయ్య ఈ సందర్భంగా చెప్పారు.

### యానాదుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో యానాదుల సమస్యలను పరిష్కరించాలని యానాదుల సంక్షేమసంఘం ప్రతినిధులు కేసీ పెంచలయ్య తదితరులు ఈనెల 16న నెల్లూరులో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో అర్జీ ఇచ్చారు. గరిమెనపెంటలో 15 ఏళ్ళుగా భూములు సాగుచేసుకుంటున్న 53 మంది యానాదులకు ఆ భూముల పట్టాలివ్వాలని కోరారు.

### పోతిరెడ్డిపాళెంలో రక్తదానం

కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంలో ఈనెల 16న అశోక్‌రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో, రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. అశోక్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని అభిమానులు రక్తదానం చేసి 40 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్‌కు అందజేశారు. మాజీ ఎంపీటీసీ రవీంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉదయగిరిలో 'నాడు-నేడు' పనుల పరిశీలన

ఉదయగిరి మండలం అప్పసముద్రం, దాసరపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను ఈనెల 18న విద్యాశాఖ అధికారులు తోట శ్రీనివాసులు, మస్తాన్‌వలీ పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు, సిబ్బందికి సూచించారు.

### పుస్తకపఠనంపై విద్యార్థులకు అవగాహన

మండల కేంద్రమైన మర్రిపాడు గ్రంథాలయంలో ఈనెల 18న విద్యార్థులకు పుస్తకపఠనంపై అవగాహన కలిగించారు. సమయాన్ని వృథాచేయకుండా మంచి పుస్తకాలు చదువుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి నారాయణరావు, కదిరినాయుడుపల్లి పుస్తకపంపిణీ కేంద్రం నిర్వాహకురాలు బి.భారతి పాల్గొన్నారు.

# ఆంధ్రా గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

మారిపోయాయి. ఎన్టీఆర్ తమకు ఏదో చేస్తారన్న నమ్మకం మాత్రమే ఆయన్ను అప్పట్లో ముఖ్యమంత్రిని చేసింది. ఆ తర్వాత మద్యపాన నిషేధం, రెండు రూపాయలకే కిలో బియ్యం లాంటి ఎన్నో పథకాలతో రామారావు ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు అభివృద్ధి నమూనాగా ఆంధ్రప్రదేశ్ ను చూపించారు. ఆ సమయంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన దరిమిలా, కేంద్రంతో కలిసి మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. ఏ ఉద్దేశంతో పనిచేశారనే విషయం పక్కన పెడితే అభివృద్ధి మోడల్గా ఆంధ్రప్రదేశ్ ను ప్రపంచానికి చూపించారు. అయితే వ్యవసాయం వంటి రంగాలను అశ్రద్ధ చేశారు. దివంగత నేత వై.ఎస్.రాజశేఖర రెడ్డి పాదయాత్ర ద్వారా కల్పించిన నమ్మకం, భరోసా ప్రజలకు కొత్త ఆశలు కల్పించింది. ఫలితంగా చంద్రబాబు ఓడిపోయారు. ఆ తర్వాత వై.ఎస్.హయాంలో ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత కరెంటు, ఫీజు రీఎంబర్స్మెంటు, వృద్ధులకు పెన్షన్ వంటి ఎన్నో కార్యక్రమాలతో పాటు, వ్యవసాయం కోసం నీటిపారుదల విభాగంలో ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు వై.ఎస్. రాజశేఖరరెడ్డికి రెండవసారి విజయాన్ని కట్టబెట్టాయి. ఆయన పరమపదించిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన నేపథ్యంలో ప్రజలంతా చంద్రబాబు వైపు మొగ్గు చూపారు. నాటి అభివృద్ధిని మళ్లీ చూడవచ్చని భావించారు. కొత్త రాష్ట్రం అయిన నేపథ్యంలో ప్రజల అంచనాలను చంద్రబాబు అందుకోలేకపోవటం, చిన్న రాష్ట్రమైన అంధకార ఆంధ్రాలో తన సామాజిక వర్గానికి బాబు తల ఒగ్గడం, ఒక్క అవకాశం అంటూ వై.ఎస్. వారసుడు జగన్ ప్రజల ముందుకు రావటం, వై.ఎస్.ఆర్. కుటుంబం మీద ఆంధ్ర ప్రజలకి ఉన్న నమ్మకం వెరసి జగన్ను గెలిపించాయి. గెలిచిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి విషయం ఎలా ఉన్నా, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, బడ్జెట్లో కొరత ఉన్నా, ఆడిన మాట తప్పకుండా, చెప్పింది చెప్పినట్లుగా, ప్రతి సారీ టంచనుగా ప్రజల ఖాతాల్లో డబ్బులు వేయడంలో మాత్రం జగన్ ఎక్కడా విఫల మవ్వలేదు.

## డబ్బులే గెలిపిస్తాయా ....?

ఇదే గెలిపిస్తుందా అంటే నమ్మకంగా చెప్పలేము. దీనికి కారణాలు ఎన్నో ఉన్నాయి. కిరణ్కుమార్రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా వై.ఎస్. పథకాలను మరింత చక్కగా కొనసాగించారు. ఆంధ్రప్రదేశ్ సమైక్యంగా ఉండాలనే సంకల్పంతో కృషి చేశారు. కానీ రాష్ట్ర విభజన తర్వాత కొత్త పార్టీ పెట్టి, పోటీ చేసిన ఆయనకు ఒక్క సీటు కూడా దక్కలేదు. అంతకు ముందు ప్రజాక్షేత్రంలోకి రాజకీయ పార్టీగా వచ్చిన లోక్సత్తా 50 గ్యారంటీల పేరుతో ప్రజలకు అభివృద్ధి పట్ల నమ్మకం కల్పించే ప్రయత్నం చేసింది. అది కూడా కలిసి రాలేదు. ఎన్టీఆర్ ఏ విధంగా జనాల్లో తిరిగి గెలిచారో, అదే విధంగా చిరంజీవి కూడా ప్రజారాజ్యం ద్వారా ప్రజల్లోకి వెళ్ళి, సరైన ఫలితాన్ని పొందలేకపోయారు. కొత్త రాజకీయాలను చూపిస్తామంటూ జనసేన ద్వారా ప్రజల్లోకి వెళ్ళి పవన్ కళ్యాణ్ సైతం అంతులేని ఫ్యాన్స్ ఫాలోయింగ్ ఉన్నా, స్వయంగా ఒక్కచోట కూడా గెలవలేక పోయారు. భారతీయ జనతాపార్టీ సైతం దేశవ్యాప్తంగా రైతుల అకౌంట్లలో డబ్బులు వేస్తున్నా, వారు సైతం చాలాచోట్ల పరాజయాలు చూస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో బోణీ కూడా చెయ్యలేక పోతున్నారు.

## ఒక్కొక్కరిదీ ఒక్కొక్క మార్గం!


గతంలో ఎన్టీఆర్, తర్వాత వై.ఎస్. రాజశేఖరరెడ్డి రాజకీయాల్లో కొత్త ట్రెండ్కు నాంది పలికారనే చెప్పాలి. ఎన్టీఆర్ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తే, వై.ఎస్.ఆర్. ఓ వైపు అభివృద్ధిపై దృష్టి పెడుతూనే మరో వైపు ప్రజల నాడిని పట్టుకుని వారి బాటలో వెళుతూ ప్రజలను తన వైపు తిప్పుకున్నారు. అదే ఆయన గెలుపు రహస్యం. ఇప్పుడు జగన్ నాన్న బాటలోనే నడుస్తున్నారు. కాకపోతే అయన అభివృద్ధి, ఆకర్షణ రెండిటిపైనా దృష్టి పెడితే ఈయన కేవలం ఆకర్షణపైనే ఫోకస్ పెట్టారు. కాబట్టి ఇది కొత్త ప్రయత్నం, ఈ ప్రయోగం ఫలిస్తుందా లేక వికటిస్తుందా అన్నది వేచి చూడాలి. ఇప్పటి వరకు రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వాలలో ప్రజలకు ఇన్ని మార్గాల్లో నేరుగా డబ్బులు ఇచ్చింది ఒక్క జగన్ ప్రభుత్వమే. రానున్న ఎన్నికల్లో ఆంధ్రాలో వై.ఎస్.ఆర్.సి.పి. గెలిస్తే మాత్రం దేశవ్యాప్తంగా పరిస్థితి మారిపోతుంది. అభివృద్ధి లేకున్నా ప్రజలకు నేరుగా డబ్బులు ఇస్తే గెలుస్తామన్న నమ్మకం బలపడే అవకాశం ఉంది. కారణాలు ఎలా ఉన్నా వై.ఎస్.ఆర్.సి.పి. ఓడిపోతే మాత్రం మనం దాన్ని మరో రకంగా అర్థం చేసుకోవచ్చు. ప్రజలు ఇంకా అభివృద్ధి కోసమే ఆలోచిస్తున్నారన్న విషయన్ని గమనించవచ్చని అంటున్నారు విశ్లేషకులు.

## రేపటి గెలుపు... దేశ రాజకీయాలకే మలుపు!

ఏదేమైనా ఎన్నికల్లో ప్రజలకు డబ్బులు పంచే పరిస్థితుల నుండి, పథకాల పేరుతో ప్రభుత్వ డబ్బుని అధికారికంగా పంచే స్థాయికి ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఎదిగిపోయాయి. తెలుగుదేశం పార్టీ సైతం దాదాపు ఇలాంటి పథకాలతోనే మళ్ళీ ప్రజల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే క్రమం తప్పకుండా బటన్ నొక్కుతున్న వై.ఎస్.ఆర్.సి.పి.కి అనుకూలంగా ఓటర్లు బటన్ నొక్కుతారా లేదంటే, ఓ వైపు అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తూ మరోవైపు మేము కూడా బటన్ నొక్కుతాం పంచుతాము అంటున్న టీడీపీకి అనుకూలంగా నొక్కుతారా అన్నది తేలాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. అయితే, ఈ గెలుపు మాత్రం దేశ రాజకీయాల్లో కీలక మలుపుగా మారి, రాజకీయ ముఖచిత్రాన్ని మార్చితీరుతుందని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు విశ్లేషకులు.

రేపటి ఆంధ్రా ఎన్నికల ఫలితాలే భారతదేశంలోని ఇతర రాష్ట్రాల పార్టీల భవిష్యత్ సూచికలన్నది వారి అభిప్రాయం. గెలిచిన మరుక్షణం నుండి అభివృద్ధిని పక్కనపెట్టి, మరో ఐదేళ్ళ తర్వాత వచ్చే ఎన్నికలకు ప్రణాళిక రచించుకొని ప్రజల ఖాతాలలో ప్రభుత్వ డబ్బులు జమ చేస్తూ వారిని ముందే కొనేయడం లాంటిదే ఇప్పుడు ఆంధ్రాలో జరుగుతున్న తంతు అన్నది విశ్లేషకుల అభిప్రాయం!

ఆంధ్రాలో జగన్ గెలిస్తే దేశంలోని అన్నీ పార్టీలు ఆయనని ఆదర్శంగా తీసుకుని, ఇతర రాష్ట్రాల పార్టీలు కూడా ఆయన ఫార్ములానే ప్రయోగిస్తాయని అంటున్నారు. అందుకనే, ఆంధ్రాలో వైసీపీ గెలుపు, దేశ రాజకీయాలలో కీలక మలుపై, అభివృద్ధి మంత్రం జపించే పార్టీలకు, నేతలకు మేలుకొలుపవుతుందన్నది వారి భావన..!



## బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు

**- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి**



బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి హెచ్చరించారు. నెల్లూరు డైకస్‌రోడ్డులో ఉన్న మహిళా ప్రాంగణాన్ని ఆమె ఇటీవల సందర్శించారు. డిఇఒ గంగాభవాని, డిఎంఅండ్‌హెచ్‌ఓ డా. పెంచలయ్య, కార్మికశాఖ డిసి వెంకటేశ్వర్లు, ఆర్ఐఒ ప్రసాద్, ఐసిడిఎస్ పిడి హేనాసుజన, పిఓ రాణి, ఏపిఓ ఉషారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి రమేష్ తదితరులతో సమావేశమై బాలల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, బాలలు బడిలో ఉండి చదువుకోవాలే తప్ప ఇతరత్రా పనుల్లో ఉండకూడదని, తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని, బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని బాలలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఓటీపీ నంబర్లు చెప్పవద్దు

ప్రభుత్వ పథకాలకోసమని ఎవరైనా అపరిచితులు ఓటీపీ నంబర్లు అడిగితే చెప్పవద్దని, అలాంటి వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సచివాలయాల అధికారి కేవీ సాంబశివారెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. అమ్మఒడి పథకానికి ఓటీపీ చెప్పాలంటూ అపరిచితులెవరో ఫోన్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, కనుక జాగ్రత్తగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ నిజంగా ఓటీపీ అవసరమైతే సచివాలయాల సిబ్బందే వాళ్ళ ఇళ్ళవద్దకు వస్తారని తెలిపారు. సచివాలయాల ద్వారా కూడా ఫోన్‌లో ఓటీపీ అడిగే పద్ధతి లేదని ఆయన స్పష్టం చేశారు.



## పెదనాన్నకు రామ్ నివాళి

వాకాడులో ఈనెల 14న జరిగిన తమ పెదనాన్న, వైయస్సార్‌సిపి సీనియర్ నాయకులు స్వర్గీయ నేదురుమల్లి పద్మనాభరెడ్డి ఉత్తరక్రియల్లో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌బోర్డు ఛైర్మెన్, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని దివంగత పద్మనాభరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూళ్లూరుపేట, గూడూరు శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, వెలగపల్లి వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, పనబాక కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కి చంద్ర గండం?



కొన్ని కొన్ని పదాలను విడివిడిగా కాకుండా... జంటగా పలకడం తెలుగు వారికి ఒక అలవాటు. ఉదాహరణకు... అలు-మగలు, ఇల్లు-వాకిలి, ఈడు- జోడు, తాడు - బొంగరం, ఆకు - వక్క, ముద్దు - ముచ్చట, ఉలుకు - పలుకు, ముక్కూ - మొహం, కాళ్ళూ - చేతులూ, ఒడ్డూ - పొడుగూ, తల్లీ - పిల్లా, మంచి - చెడు... అని ఇలా అంటుంటాము కదా, ఆయా సందర్భాలను బట్టి!

అలాగే, తెలంగాణ - ఆంధ్ర అనేది కూడా జంట పదమే.

తెలంగాణ, ఆంధ్ర అనే వాటి అస్తిత్వాలు ఒకదానిలో ఒకటి అంతర్భాగాలు. రెండూ కలిపితే తెలుగు జాతి. నిండుగ వెలిగే జాతి.

నిద్రలేచింది మొదలు, ఆంధ్ర వారికి తెలంగాణ కావాలి. తెలంగాణకు ఆంధ్ర వారు కావాలి. ఈ రెండూ ట్విన్ స్టేట్స్. జంట నగరాల లాంటి, జంట రాష్ట్రాలు.

రాజకీయంగా సైతం ఆంధ్ర పరిణామాలు తెలంగాణ రాజకీయ గమనాన్ని అమితంగా ప్రభావితం చేస్తుంటాయి.

హైదరాబాద్ జంటనగరాలు, రంగారెడ్డి జిల్లా, వాటి పరిసర ప్రాంతాలు, ఖ(క)మ్మం, నిజామాబాద్, నల్గొండ వంటి జిల్లాలలో ఆంధ్ర మూలాలు కలిగిన జనం లక్షల సంఖ్యలో నివసిస్తూ ఉండడమే ఇందుకు కారణం.

దాదాపు 60 సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు, ఇతర తెలంగాణ జిల్లాలకు మొదలైన సీమాంధ్ర ప్రాంత వాసుల 'వలస', అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఇక ముందూ ఉంటుంది కూడా. తెలంగాణలోనే పుట్టి పెరిగి, చదువు'కొని', పెళ్లిళ్లు చేసుకుని, పిల్లల్ని కని, ఉద్యోగాలు చేసి, రిటైర్ అయ్యి, అనాథ శరణాలయంలో చేరి, చనిపోయి, స్మశాన వాటికలకు చేరిన ఆంధ్రులకు లెక్కే లేదు. లక్షల్లో ఉంటారు.

హైదరాబాద్‌ను తెలంగాణ వాసులతో పాటు ఆంధ్రులు కూడా ఒక 'ల్యాండ్ ఆఫ్ ఆపర్చునిటీస్'గా మలుచుకోవడమే ఇందుకు కారణం.

సీమాంధ్ర ప్రాంతపు ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేసే రాజకీయ, అధికార, వ్యాపార, సామాజిక, పారిశ్రామిక వర్గాలవారు హైదరాబాద్‌లో స్థిర నివాస భవనాలు, ఆస్తి పాస్తులు లేని వారిని వేళ్ళ మీద లెక్కించవచ్చు. అక్కడ సర్వ మోసాలు, ఘోరాలు-నేరాలు, అరాచకాలు, అక్రమాలు, వ్యాపారాలు చేసేవారి ఆస్తిపాస్తులు ఇక్కడే గుట్టలు గుట్టలుగా పోగడిపోయి, తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఇతోధికంగా దోహదం చేస్తున్నాయి. పది పన్నెండేళ్ల క్రితం పది, పన్నెండు లక్షలకు లభించే ఓ ఫ్లాట్ ధర ఈ అక్రమ ధనరాశుల కారణంగా రెండు కోట్లకు, మూడు కోట్లకు ఎగబాకింది. హైదరాబాద్‌లో నగదు లావాదేవీల స్థాయిని ఎక్కడికో తీసుకెళ్ళింది. "డబ్బు" అనే పదానికి విలువ లేకుండా చేసింది.

అందుకే, తెలంగాణ నిరంతర అభివృద్ధికి ఆంధ్ర కావాలి. కడుపు చేత పట్టుకుని హైదరాబాద్ వచ్చే ఆంధ్రుల మనుగడకు తెలంగాణ కావాలి.

ఈ బంధమే రాజకీయాలను కూడా ప్రభావితం చేస్తూ వచ్చింది. ఇక ముందూ చేస్తూనే ఉంటుంది. ఇదో శాశ్వత బంధం, ఎవరికి ఇష్టం ఉన్నా, లేకపోయినా!

ఈ నేపథ్యంలో మరో నెలన్నరలో జరగవలసి ఉన్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో... ముచ్చటగా మూడోసారి గెలిచి అధికారంలోకి రావాలని ఆశపడుతున్న కేసీఆర్‌కి 'చంద్రబాబు గండం' పొంచి ఉందా అనే అనుమానాలను పలువురు పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు అరెస్ట్ అయితే, బీఆర్ఎస్ నేతల నుంచి 'ఉలుకు-పలుకు' లేకపోవడంతో, తెలంగాణ ప్రభుత్వ పాలక పెద్దలు ఆయన అరెస్ట్‌ను అంతర్గతంగా ఆనందించి ఉంటారనే భావం తెలంగాణలోని 'సీమాంధ్రుల'లోని అధికుల్లో కలిగింది అంటున్నారు.

హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధితో పాటు, తెలంగాణలోని ఖ(క)మ్మం, నిజామాబాద్, నల్గొండ వంటి ప్రాంతాలలోని సీమాంధ్రులు దాదాపు 40 నియోజకవర్గాలలోని ఫలితాలను ప్రభావితం చేయగలిగిన సంఖ్యాబలం కలిగి ఉన్నారు. (అసలు అసెంబ్లీకి ఉన్నదే 119 సీట్లు.)

వీరిలో... ఓటు హక్కు కలిగి ఉన్న వారిలో అత్యధికులు ఈసారి బీఆర్ఎస్‌కు తమ ఉనికి ప్రభావాన్ని గుర్తు చేయబోతున్నారనే వార్తలు వెలువడుతున్నాయి. అదే గనుక నిజమైతే, బీఆర్ఎస్‌కు 'చంద్రబాబు గండం' ఎదురైనట్లే!

బీఆర్ఎస్‌కు వారు ఎదురు తిరుగుతారు అనే అంచనాలు షికారు చేయడానికి మరో బలమైన కారణం కూడా ఉంది.

సీమాంధ్ర ప్రాంతపు ఎన్నికల కంటే, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు నాలుగైదు నెలలు ముందుగా జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో కేసీఆర్ గెలిస్తే,






ఆంధ్ర ఎన్నికల్లో చంద్రబాబుకు వ్యతిరేకంగా కేసీఆర్ చేయగలిగినంతా చేస్తారనే భయం తెలంగాణలోని సీమాంధ్రులలోని అత్యధికుల్లో ఉన్నట్టు కనపడతోంది. అందువల్ల కూడా బీఆర్ఎస్ పట్ల 'తెలంగాణ ఆంధ్రుల' సుముఖత అంతగా వ్యక్తం కావడం లేదు.

దీంతో, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యతిరేకంగా పనిచేస్తాయని భావిస్తున్న అనేక అంశాలలో ఇప్పుడు 'చంద్రబాబు గండం' కూడా చేరిపోయింది.

అయితే, రాజకీయ మాయోపాయాలలో ఆరితేరిన కేసీఆర్, దీనిని ఎలా అధిగమిస్తారో చూడవలసి ఉంది.

ఆయనకు ఇప్పటికే బీజేపీ తలపోటు, కాంగ్రెస్ తలపోటుకు ఇప్పుడు చంద్ర పోటు కూడా తోడైందనే చెప్పాలి.

'చంద్ర హింస' ఎపిసోడ్‌లో బీజేపీ ఢిల్లీ పెద్దల భాగస్వామ్యం ఉండి ఉంటుందనే భావం సమాజంలో విస్తృతంగా వ్యాపించి ఉన్నందు వల్ల, తెలంగాణ ఆంధ్రుల ఓట్లలో అధిక శాతం బీజేపీకి లభించే అవకాశమే లేదు. అందువల్ల, తెలంగాణ ఎన్నికలలో బీజేపీ విజయం సాధించే ప్రశ్నే లేదు. ఇప్పుడు, తెలంగాణ అసెంబ్లీలో 1.. 2... 3...గా ఉన్న బీజేపీ సభ్యుల బలం మహా అయితే రెండంకెలలోకి అడుగు పెట్టవచ్చు. రేపొద్దున్న టీడీపీతో బీజేపీ జత కట్టి తెలంగాణలో పోటీచేసినా బీజేపీకి పెద్దగా సుఖం ఉండదు.

ఈ నేపథ్యంలో తెలంగాణ ఆంధ్రుల ఓట్లు కాంగ్రెస్‌కు అధికంగా పోలయ్యే అవకాశాలను పరిశీలకులు కొట్టి పారేయడం లేదు. కారణం లేకపోలేదు.

తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి భౌతికంగా కాంగ్రెస్... మానసికంగా టీడీపీ అనే భావం చాలామందిలో ఉంది. తెలంగాణలో టీడీపీ చెరువు ఎండిపోతున్నదనే దూరపు చూపుతో, కాంగ్రెస్ చెరువులోకి దూకేసిన తెలివైన చేప రేవంత్‌రెడ్డి అని రాజకీయ వర్గాల వారు చమత్కరిస్తుంటారు. అందువల్ల కాంగ్రెస్ తెలంగాణలో గెలిస్తే ఆ తరువాత నాలుగైదు నెలలకు జరగబోయే ఆంధ్ర ఎన్నికల్లో టీడీపీకి శుభకర పరిణామంగా ఉంటుంది అనే భావన కూడా తెలంగాణ ఆంధ్రులలో ఉంది. వీరిలో అత్యధికులకు కావలసింది కూడా అదే.

ఈ పరిస్థితుల్లో... మొత్తం 119 స్థానాల్లో బీఆర్ఎస్‌కు ఖచ్చితంగా 60... 61 సీట్లు వస్తేనే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కేసీఆర్‌ను తెలంగాణ గవర్నర్ ఆహ్వానించే అవకాశం ఉంది. ఏమాత్రం తగ్గినా, కొనుగోళ్ళకు అవకాశం బీఆర్ఎస్‌కు ఉండకపోగా బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన వారిలో కొందరికి రెక్కలొచ్చి ఎగిరిపోయే అవకాశాలు లేకపోలేదు. అలా కాకుండా బీజేపీతోనో, కాంగ్రెస్‌తోనో జతకట్టక తప్పని పరిస్థితి బీఆర్ఎస్‌కు ఎదురైతే... ముఖ్యమంత్రి పదవిని కేసీఆర్‌కు వదలరు. ఆ పదవిని బీఆర్ఎస్‌తో జత కట్టే పార్టీ ఎగరేసుకుపోతుంది.

ఈ సమీకరణాలను ఒకసారి సమీక్షించుకుంటే తెలంగాణ ఆంధ్రుల ఓటు ఎంత కీలకమో బీఆర్ఎస్ నేతలకు అర్థం అవుతుంది.

అందువల్లనే, 'చంద్ర గండం'ను అధిగమించడానికి కేసీఆర్ ఏమి చేయబోతున్నారు అనేది ఆసక్తికరంగా మారింది.

'మానిఫెస్టో' రూపంలో తెలంగాణపై ఓ సమ్మోహనాస్త్రాన్ని కేసీఆర్ సంధించారు.

'మానిఫెస్టో'లను ఎలా అమలు చేస్తారో నేతలు చెప్పరు. వాటి అమలుకు అవసరమైన డబ్బు ఎక్కడి నుంచి, ఎలా సేకరిస్తారో చెప్పరు. మేనిఫెస్టోలకు చట్ట బద్ధత ఉండదు. జవాబుదారీ తనం ఉండదు. జనాన్ని బురిడీ కొట్టించగల తాయిలం ఆలోచన వస్తే ప్రకటించి వేయడమే.

తెలంగాణలోని సీమాంధ్రులు... కేసీఆర్ పట్ల గుర్రుగా ఉన్నదీ, లేనిదీ ఖ(క)మ్మం బరిలో గెలిచే వారిని బట్టి అంచనా వేయవచ్చు.

అక్కడ బీఆర్ఎస్ తరపున పువ్వాడ అజయ్‌కుమార్, కాంగ్రెస్ తరపున తుమ్మల నాగేశ్వరరావు బరిలోకి దిగుతున్నారు. అక్కడ బీజేపీ, ఇతర చిల్లర - మల్లర అభ్యర్థుల పేర్లు కూడా బ్యాలెట్ బాక్స్‌పై ఉన్నప్పటికీ, వీరిద్దరి మధ్యే ప్రధాన పోటీ అనడంలో సందేహం ఏమీ లేదు.

వీరిద్దరూ కమ్మ వర్గీయులే. ఖ(క)మ్మంలో పువ్వాడ అజయ్ గెలిస్తే, తెలంగాణలోని సీమాంధ్రులలోని అత్యధికులు కేసీఆర్ పట్ల గుర్రుగా లేరనే భావనకు రావచ్చు.

కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు గెలిస్తే మాత్రం, కేసీఆర్... ఒక్కసారి తన రాజకీయాన్ని పునఃసమీక్షించుకోవాల్సి ఉంటుంది.

తెలంగాణలో స్థిరపడిన 'సీమాంధ్రులు' తెలంగాణకు ఒక "నెసెసరి ఈవిల్". వారు లేకుండా కుదరదు, వారి మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండానూ కుదరదు.

**- భోగాది వేంకట రాయుడు**
శాన్ఫ్రాన్సిస్కో నుండి...
medhomadhanam@gmail.com

# పోలీసన్నా!.. నీ సేవలకు సలాం!



**పోలీసులంటే..లాఠీలు ఝుళిపిస్తూ, కరకుగా కనిపిస్తుంటారు. అందుకే పోలీసులంటే అందరూ భయపడుతుంటారు. కానీ తప్పదు..సమాజంలో అకృత్యాలను, అశాంతిని అణిచేయాలంటే అలా కరుగ్గా..చురుగ్గా వ్యవహరించక తప్పదు. కొందరు పోలీసులు తుపాకులతో ఉగ్రవాదులను సైతం ఎదుర్కొనేందుకు ప్రాణాలకు సైతం తెగించి పోరాడుతుంటారు. అసాంఘికశక్తుల పీచమణించేందుకు, తీవ్రవాదులు, ఉగ్రవాదుల ఆటకట్టించి సమాజంలో ప్రజలకు శాంతిభద్రతలు కల్పించేందుకు నిరంతరం శ్రమిస్తుంటారు. పోలీసే లేకపోతే సమాజం గతి దుర్గతే! అందుకే, తన కుటుంబాన్ని కూడా పట్టించుకోకుండా సమాజ శ్రేయస్సుకు పాటుపడే పోలీసుల త్యాగనిరతిని ఏనాటికీ ఎవరూ విస్మరించకూడదు. 'అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం' సందర్భంగా, సమాజంలో శాంతిని నెలకొల్పడం కోసం కృషిచేస్తూ, విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం ప్రజలందరి కర్తవ్యం.**

ఏ ప్రజాస్వామ్య దేశానికైనా శక్తిని సమకూర్చేది ప్రజలే. ఆ ప్రజలకు ప్రజాస్వామ్యం ద్వారా వచ్చిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, సమానత్వాన్ని, మానవహక్కులను రక్షించేందుకు, సమాజంలో శాంతిని పరిరక్షించేందుకు అనుక్షణం కృషిచేసేది పోలీసులే. అసాంఘిక శక్తులపై దాడులు చేస్తున్న సందర్భాల్లో, తీవ్రవాదులను అణచివేసే సమయాల్లో ఒక్కోసారి ప్రాణాలను కూడా పోగొట్టుకొనేది పోలీసులే. విధి నిర్వహణలో వీరమరణం పొందుతున్న అలాంటి పోలీసులను స్మరించుకోవడం మన విధి!

క్రమశిక్షణ–నిబద్ధతలకు మారుపేరుగా నిలుస్తూ ఎందరో పోలీసులు సమాజాన్ని అసాంఘిక శక్తుల బారిన పడకుండా రేయింబవళ్ళు కంటికి రెప్పలా కాపాడుతుంటారు. సమాజం ఆపదలో ఉన్నప్పుడు మేమున్నామంటూ ముందుకు వచ్చి ప్రజలకు భరోసా కల్పించేది పోలీసులే. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సామాజిక సేవాభావంతో పోలీసులు చేసిన సేవలు ఏనాటికీ మరువలేనివి..మరపురానివి. ప్రజలందరూ హాయిగా నిద్రపోతున్న వేళ, కంటిమీద రెప్పవేయకుండా మేలుకొని, ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా కాపాడేది కూడా పోలీసులే. నేరాలకు ఘోరాలకు పాల్పడే దొంగలు, హంతకులు, కరడుగట్టిన నేరస్తులు, అసాంఘికశక్తులపై అత్యంత ధైర్యసాహసాలతో పోరాడుతూ, సమాజ రక్షణే ధ్యేయంగా ప్రజలకు రక్షణగా నిలిచేది పోలీసన్నలే. విధి నిర్వహణలో అమరులైన వారి త్యాగాలను గుర్తుకు తెచ్చుకుని, వారికి ముకుళిత హస్తాలతో వందనం చేసి నివాళులర్పించడం..ఈ సందర్భంగా ప్రతిఒక్కరి కనీస ధర్మం!

## పోలీసుల త్యాగనిరతి అపూర్వం

**– వై.శ్రీహరి (రాష్ట్ర గౌరవ సలహాదారు, ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం)**

సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడే పోలీసుల సేవలు అమోఘం. దేశవ్యాప్తంగా ఎందరో పోలీసులు విధి నిర్వహణలో ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూనే ఉన్నారు. అసాంఘిక శక్తుల నుంచి ఎలాంటి సవాళ్లు ఎదురైనా ధీటుగా ఎదుర్కొని సమాజంలో శాంతిభద్రతలు కాపాడుతున్నారు. విధి నిర్వహణలో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు కూడా. శౌర్య చిహ్నాలుగా వారెల్లప్పుడూ చిరస్మరణీయులుగానే ఉన్నారు. అలాంటి పోలీసు అమరవీరుల త్యాగాలను, బలిదానాలను కీర్తిస్తూ, పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పాటిస్తుండడం జాతికే గర్వకారణం. పోలీసు అమరవీరుల స్థూపంపై లిఖించబడిన 'ఈనాటి మా ఈ ఆత్మార్పణం –రేపటి మీకోసం సమర్పణం' అనే మాటలు ఎల్లవేళలా జాతి మదిలో స్ఫూర్తిని నింపుతూనే ఉంటాయి.

# 'గగన్‌యాన్'కు సమాయత్తం


## • 21న ముందస్తు ప్రయోగం



అంతరిక్ష పరిశోధనల్లో మరో ప్రతిష్టాత్మకమైన 'గగన్‌యాన్' ప్రయోగానికి ఇస్రో శాస్త్రవేత్తలు సమాయత్తమవుతున్నారు. గగన్‌యాన్ ముందస్తు పరీక్షల్లో కీలకప్రయోగానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అందుకు సంబంధించిన ప్రాథమిక పరిశోధనలు, పరిశీలనలు అన్నీ పూర్తయ్యాయి. అక్టోబరు 21వ తేదీ ఉదయం 8 గంటలకు షార్ మొదటి ప్రయోగ వేదికపై నుంచి 'టెస్ట్ వెహికల్ డిపార్ట్‌మెంట్ ఫ్లైట్'–టీవీడీ–1 పేరుతో దీనిని ప్రయోగించనున్నారు. మానవసహిత గగన్‌యాన్‌కు ముందస్తుగా ఇలాంటి ప్రయోగాలను ఇస్రో చేపడుతోంది. భూమి నుంచి 11కిలోమీటర్ల దూరం దాకా ఈ దశలో రాకెట్ అంతరిక్షయానం చేస్తుంది. ఆ తర్వాత ఇందులో ప్రవేశపెట్టిన క్రూమాడ్యూల్ క్షేమంగా సముద్రానికి చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భవిష్యత్తులో మానవసహిత అంతరిక్ష నౌక మిషన్ కోసం మానవ రహిత అంతరిక్ష ప్రయోగ పరీక్షను జరుపనున్నారు. అంతరిక్షంలోకి మానవులను పంపేందుకు ముందుగా, రోబోను ప్రయోగించడానికి కూడా రూపకల్పన చేస్తున్నారు. ఈ గగన్‌యాన్ క్రూమాడ్యూల్ ప్రయోగం కూడా తప్పకుండా విజయం సాధిస్తుందని అందరూ ఆకాంక్షిస్తున్నారు.









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com